# మనజనప్రగతి


జనం కోసం.. అక్షర ప్రగతి...

తెలుగు దినపత్రిక

సంపుటి : 6 | సంచిక : 164 | పేజీలు : 8 | వెల : రూ.2/- శుక్రవారం 10 జులై 2026 | వైఎస్సార్ కడప

Circulated by Kadapa, Ananthapur, Chittor, Vishakapatanam, Srikakulam, Elluru, Thirupathi, Ongole, Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool





- 2027 మార్చికి 72 లక్షల పట్టాదారు పాస్ పుస్తకాలు
- వైసీపీ తెచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ నల్లచట్టమే
- పాస్ పుస్తకాలు, సర్వేరాళ్లపై ఫోటోల పిచ్చిని రాజముద్రతో తుడిచేశాం
- పురాణాల్ని దూషించి, పాకిస్తాన్‌ను సమర్థించిన రావణ్‌కు వైసీపీ ఆర్థిక సాయం
- బనగానపల్లె మీ భూమి మీహక్కు బహిరంగ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు

# ప్రజల ఆస్తిపై ప్రజలకే అధికారం

**బనగానపల్లె,మన జనప్రగతి జూలై 09:** ప్రజల ఆస్తిపై ప్రజలకే అధికారం ఉండేలా రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను జారీ చేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలకు పరిష్కారం కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని సీఎం స్పష్టం చేశారు. నంద్యాల జిల్లా బనగానపల్లెలో మీ భూమి– మీ హక్కు కార్యక్రమంలో భాగంగా రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలను ముఖ్యమంత్రి పంపిణీ చేశారు. అనంతరం బహిరంగ సభలో మాట్లాడుతూ.. "గడచిన రెండేళ్లుగా సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన ప్రజలకు అందుతోంది. గత పాలకుల పాపాలు ప్రజలకు శాపాలుగా మారాయి. లక్షల కుటుంబాలు వారి అరాచకానికి బలి అయ్యాయి. నచ్చని వారిని భయపెట్టేందుకు మిగతా2లో...

## కళాకారుల ఆరోగ్యం, సంక్షేమం కూడా

# ముఖ్యమే...

- కళాకారులతో మాట్లాడినప్పుడు వారి ఆరోగ్య సమస్యలు గుర్తించా...
- అందుకే వారి ఆరోగ్యం కోసం ఉచిత వైద్య చికిత్స ఏర్పాటు చేశా...
- ఎక్స్ వేదికగా డిప్యూటి సిఎం పవన్ కల్యాణ్ వెల్లడి



**అమరావతి,మన జనప్రగతి జూలై 09:** సంప్రదాయ కళలను పరిరక్షించడం అంటే వాటిని ప్రోత్సహించడం మాత్రమే కాదని, వాటిని జీవనాధారంగా చేసుకున్న కళాకారుల ఆరోగ్యం, సంక్షేమాన్ని కాపాడటం కూడా ప్రభుత్వ బాధ్యత అని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ హస్తకళా మహోత్సవం సందర్భంగా హస్తకళాకారులు, చేనేత కార్మికులతో మాట్లాడిన సమయంలో వారు ఎదుర్కొంటున్న వృత్తి సంబంధిత ఆరోగ్య సమస్యలు తన దృష్టికి మిగతా2లో...

## ధాన్యం కొనుగోలులో

# రికార్డు




- వినూత్న సంస్కరణలతో రైతులకు మేలు
- పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

## పరిహారం ఇవ్వకుండా మత్స్యకారుల

# కుటుంబాలను వేధించిన వైసీపీ

● గత ప్రభుత్వ పెండింగ్ బకాయిలైన రూ.13.05 కోట్లను అధికారంలోకి రాగానే చెల్లించాం ● వైసీపీ హయాంలో మత్స్యకారులు తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యారు ● విశాఖ తీరంలో గల్లంతైన మత్స్యకారుల కోసం యుద్ధ ప్రాతిపదికన గాలింపు చర్యలు చేపట్టాం ● రాజకీయ లబ్ధి కోసం మత్స్యకారుల సమస్యలను వాడుకోవడం జగన్‌కు తగదు ● వ్యవసాయ, మత్స్యశాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



**అమరావతి,మన జనప్రగతి జూలై 09:** మత్స్యకారుల గురించి మాట్లాడే నైతిక హక్కు వైసీపీకి లేదని రాష్ట్ర వ్యవసాయ, మత్స్యశాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రంగా విమర్శించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో మత్స్యకారుల సంక్షేమాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారని, ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన 63 మంది మత్స్యకారుల కుటుంబాలకు చెల్లించాల్సిన పరిహారం, ఇతర పెండింగ్ బిల్లులను కూడా విడుదల చేయకుండా అన్యాయం మిగతా2లో...

## ఐదేళ్ల వైసీపీ అరాచక పాలన వల్ల

# నష్టపోయిన రాష్ట్రం

- రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడి



**మచిలీపట్నం,మన జనప్రగతి జూలై 09:** గత ఐదేళ్ల వైసీపీ అరాచక పాలన వల్ల రాష్ట్రం తీవ్రంగా నష్టపోయిందని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర మండిపడ్డారు. వైసీపీ అధినేత నుంచి చోటా నాయకుల వరకు అభివృద్ధికి ఆటంకాలు సృష్టించడమే పనిగా పెట్టుకున్నారని ధ్వజమెత్తారు. ప్రతిపక్షాలు చేస్తున్న పసలేని మిగతా2లో...

## రాజముద్రతో పాసుపుస్తకాలు రైతులు

# అస్తికి పూర్తి చట్టభద్రత

● రైతులు, ప్రజలు ఆస్తి, హక్కులను కాపాడడమే కూటమి ప్రభుత్వం లక్ష్యం ● రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి



**ఏలూరు,మన జనప్రగతి జూలై 09:** ఆగిరిపల్లి మండలం ఆగిరిపల్లి గ్రామంలో గురువారం రైతులో సేవలో "మీ భూమి–మీ హక్కు" కార్యక్రమంలో భాగంగా అనంతసాగరం, పిన్నమరెడ్డిపల్లె, కనసానపల్లె గ్రామాలకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాసుపుస్తకాలను రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాలు శాఖ మంత్రి కొలుసు పార్థసారథి రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ రైతులు భూహక్కులకు చట్టబద్ధమైన భరోసాను కల్పించేందుకు కూటమి ప్రభుత్వం లక్ష్యమని అన్నారు. రాజముద్రతో కూడిన పట్టాదారు పాసుపుస్తకాలను అందజేస్తోందని, ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ పాసుపుస్తకాలకు భూ యాజమాన్యానికి అధికారిక ధ్రువీకరణగా ఉండటంతో పాటు రైతులకు మిగతా2లో...

## ఏపిఎస్ఆర్టీసిని ప్రైవేటీకరణ చేసే

# ప్రసక్తే లేదు

విద్యుత్ బస్సులతో ఆధునిక ప్రజా రవాణా వ్యవస్థే ప్రభుత్వ లక్ష్యం

రాష్ట్ర రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబు




# బిఆర్ఎస్ రాజ్యసభ నేతగా వద్దిరాజు

## సురేశ్ రెడ్డి పదవీకాలం ముగియడంతో కెసిఆర్ నిర్ణయం



**హైదరాబాద్,మన జనప్రగతి జూలై 09:** రాజ్యసభలో బీఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్‌గా ఉన్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ఫ్లోర్ లీడర్‌గా నియమితులయ్యారు. రాజ్యసభ సభ్యుడుగా, బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్‌గా ఉన్న కేఆర్ సురేష్ రెడ్డి పదవీకాలం ముగియడంతో మిగతా2లో...

మనజనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి...
తెలుగు దినపత్రిక
10 - 07 - 2026

# ప్రజల ఆస్తిపై ప్రజలకే అధికారం

(మొదటి పేజీ తరువాయి)

వారి భూముల్ని గత పాలకులు 22ఏ కింద చేర్చారు. వివాదాలు సృష్టించి భూములు లాక్కునేందుకు ప్రయత్నాలు చేశారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్టు పేరిట ఓ నల్ల చట్టాన్ని తెచ్చారు. ప్రజల ఆస్తుల్ని కాజేసేలా భయాందోళనలు సృష్టించారు. ఈ ల్యాండ్ టైటిలింగ్ యాక్టు తేవటమే సమస్యను మరింత జటిలం చేసింది. అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ నల్ల చట్టాన్ని రద్దు చేశాం. భూ వివాదాల పరిష్కారానికి ధృఢ సంకల్పంతో ముందుకు వెళ్తున్నాం. గత పాలకులు ప్రజల భూమి పత్రాలపైన, సర్వే రాళ్లపైనా ఫోటోలు ముద్రించుకున్నారు. ఆ ఫోటోల పిచ్చిని తుడిచేసేందుకు రాజ ముద్రతో పట్టాదారు పాసు పుస్తకాలు జారీ చేస్తున్నాం. కట్టుదిట్టమైన భద్రతా ఫీచర్లను పెట్టి తప్పులు లేకుండా రైతులు, భూ యజమానులకు పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తున్నాం. ఇదో ఉద్యమంగా, పవిత్రమైన కార్యక్రమంగా చేపట్టి భూ యజమానులకు హక్కులు కల్పిస్తున్నాం. 2027 మార్చి నాటికి 9833 గ్రామాల్లో 72,70.,605 పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ చేస్తాం. ఏపీని ఎలాంటి భూ వివాదాలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్నదే కూటమి ప్రజా ప్రభుత్వ లక్ష్యం. విలేజ్ ఇనామ్ భూములను కూడా 22ఏలో పెట్టేశారు. వీటిని 1971 గ్రామాల్లో రికార్డ్ ఆఫ్ రైట్స్ పూర్తి చేశాం. ఆటో మ్యూటేషన్ ద్వారా వారసత్వ ఆస్తుల్ని సంబంధిత వ్యక్తులకు చెందేలా చేస్తున్నాం. తిరుపతి జిల్లా శెట్టిపల్లి, గుంటూరులోని వట్టి చెరుకూరు, చిత్తూరు జిల్లా కంగుందిలో చాలా ఏళ్లుగా ఉన్న భూ వివాదాలను పరిష్కరించాం. డోన్ నియోజకవర్గంలో ఉన్న 2074 ఎకరాల వక్ఫ్ భూముల్ని కూడా 22ఏలో గత పాలకులు పెట్టారు. ఆ భూముల్ని 22ఏ జాబితా నుంచి తొలగించి రైతుల సమస్యల్ని పరిష్కరించాం." అని సీఎం అన్నారు. వారు రాసింది రక్త చరిత్ర– మాది అభివృద్ధి సంకల్పం"రాష్ట్రవ్యాప్తంగా భూసమస్యల్ని పరిష్కరించటంతో పాటు అన్ని ప్రాంతాల అభివృద్ధికి పనిచేస్తున్నాం. రాయలసీమ ముఖ చిత్రాన్ని మారుస్తున్నాం. కడప స్టీల్ ప్లాంట్, హీరో మోటార్స్, అమ్కా డిఫెన్సు ఫైటర్ జెట్ ప్లాంట్ ఏర్పాటు అవుతోంది. డిఫెన్సు, ఏరోస్పేస్, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్ తదితర రంగాల్లో ప్రాజెక్టులు, ఉద్యోగ ఉపాధి అవకాశాలతో రాయలసీమ రతనాల సీమగా మారుతుంది. రాయలసీమలో తయారైన ఎన్ ఫీల్డ్ బుల్లెట్ లు దేశమంతా తిరుగుతాయి. రూ.40 వేల కోట్ల ప్రభుత్వ పెట్టుబడులు, ప్రైవేటు పెట్టుబడులతో రాయలసీమ హార్టీ కల్చర్ హబ్ గా మారుతుంది.నగరాలు, పట్టణాల కంటే కడప జిల్లా లింగాల వంటి ప్రాంతాల్లోనే తలసరి ఆదాయం ఎక్కువ ఉంది. నంద్యాలలోనూ హార్టికల్చర్ అభివృద్ధికి ఎన్నో అవకాశాలు ఉన్నాయి. ఎల్ నినో కారణంగా వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ సీజన్ లో 22 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. నీటిని పొదుపుగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉంది. అందుకే జలధార కార్యక్రమాన్ని కూడా రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించాం. నంద్యాల జిల్లాలో 18 కిలోమీటర్ల ఫీడర్ ఛానల్, చెక్ డ్యామ్ లు నిర్మించిన జిల్లా యంత్రాంగానికి అభినందనలు. వర్షపు నీటిని భూగర్భజలాలుగా మార్చుకుంటే నీటి భద్రత సాధ్యం అవుతుంది. రాయలసీమలో వారు రక్త చరిత్ర రాస్తే మేం అభివృద్ధి సంకల్పం చేస్తున్నాం. ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన అందించటమే లక్ష్యంగా కూటమి ప్రజా ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోంది.ప్రజలకు అందిస్తున్న పథకాలు, కార్యక్రమాలు, సేవలపై ప్రజల నుంచి అభిప్రాయాలు తెలుసుకుని దానికి అనుగుణంగా పనితీరు మెరుగు పర్చుకుంటున్నాం. ప్రజలకు అత్యుత్తమ సేవలను అందించటమే ప్రభుత్వ లక్ష్యం. బాగా పనిచేసిన అధికారులను అభినందిస్తున్నాను. రాష్ట్రంలో మహిళల భద్రతకు పెద్ద పీట వేస్తున్నాం. సామాజిక మాధ్యమాల్లో కొందరు దుర్మార్గాలకు పాల్పడుతున్నారు. రావణ్ అనే వ్యక్తి పురాణాల్ని దూషిస్తాడు, మన రాముడిని, సీతపై నీచంగా మాట్లాడతాడు. తీవ్రవాదాన్ని , పాకిస్తాన్ ను సమర్థిస్తాడు. అలాంటి వారికి గొడ్డలి పార్టీ ఆర్థిక సాయం అందిస్తుంది. ఎంతటి బరితెగింపు ఇది. ప్రజలు దీనిని గుర్తించాలి. వారి పోకడలు ఏమిటో తెలుసుకోవాలి. ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తినే దూషిస్తున్న వారికి సామాన్య ప్రజలు ఏం లెక్క. తిరుమలకు వెళ్లి డిక్లరేషన్ ఇమ్మంటే వాటిని తిరస్కరించి అపచారం చేశారు. నేను చర్చికి వెళ్లినా, మసీదుకు వెళ్లినా అక్కడి మతాచారాలను గౌరవిస్తాను. హే రామ్ అంటూ రావణుడ్ని ప్రోత్సహిస్తున్న వ్యక్తులను ఏమనాలో తెలీడం లేదు. కాలజ్ఞానం రాసిన పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి కూడా ఇలాంటి వింతలు విచిత్రాలు జరుగుతాయని చెప్పారు. మతవిద్వేషాలు ఎవరు రెచ్చగొట్టే ప్రయత్నం చేసినా చూస్తూ ఊరుకోం. నంద్యాలలో వైఎస్సార్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వ్యక్తి వైసీపీకి చెందిన వాడే అని తెలిసి తోక ముడిచారు. ఓట్లు కోసం తండ్రికి పూజలు చేస్తు న్నాడు. బ్రతికి ఉన్న తల్లికి మాత్రం ఆస్తి ఇవ్వకుండా క్షోభ పెడుతున్నాడు. ఇలాంటి వ్యక్తులు మన సమాజా నికి అవసరమా. తల్లికి గౌరవం ఇవ్వని వ్యక్తులు మనకు ఎందుకు?" అని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. అనంతరం బహిరంగ సభా వేదిక సమీపంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను సీఎం పరిశీలించారు. వెదురుతో తయారు చేసిన ఆభరణాలను సీఎం ఆసక్తిగా పరిశీలించారు. డ్వాక్రా, మెప్మా మహిళలు తయారు చేస్తున్న ఉత్పత్తులను స్వయం బ్రాండ్ పేరిట మార్కెటింగ్ చేయాలని సీఎం ఆదేశించారు.

# కళాకారుల ఆరోగ్యం, సంక్షేమం కూడా ముఖ్యమే...

(మొదటి పేజీ తరువాయి)

వచ్చాయని ఆయన పేర్కొన్నారు. ఎక్స్ వేదికగా పవన్ కల్యాణ్ స్పందిస్తూ.. హస్తకళా మహోత్సవం సందర్భంగా హస్తకళాకారులు, చేనేత కార్మికులతో ఆత్మీయంగా మమేకమయ్యే అవకాశం లభించిందన్నారు. వారి అసాధారణ నైపుణ్యం, అపారమైన ఓర్పు, వృత్తిపట్ల ఉన్న అంకితభావం ఎంతో ఆకట్టుకున్నాయన్నారు. ఏళ్ల తరబడి కష్టపడి పనిచేస్తున్న కళాకారులు వెన్ను, మెడ, కీళ్ల నొప్పులు, కంటి సమస్యలు, శ్వాస సంబంధిత ఇబ్బందులు వంటి అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలను తమ చేతుల మీద మోస్తున్న కళాకారుల ఆరోగ్యాన్ని కాపాడటం కూటమి ప్రభుత్వ బాధ్యత అని బలంగా విశ్వసిస్తున్నట్లు చెప్పారు.కళాకారుల సమస్యలను తెలుసుకున్న వెంటనే సంబంధిత అధికారులను ఆదేశించి రాష్ట్రంలోని వివిధ హస్తకళా, చేనేత కళాకారుల క్లస్టర్లలో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించేలా చర్యలు తీసుకున్నామని డిప్యూటీ సీఎం వెల్లడించారు. తిరుపతి జిల్లాలోని శ్రీకాళహస్తి కలంకారీ కళాకారులు, పశ్చిమ గోదావరి జిల్లాలోని సీతారాంపురం క్రోషే లేస్ కళాకారుల కోసం నిన్న(జులై 8న) వైద్య శిబిరాలు విజయవంతంగా నిర్వహించినట్లు పవన్ చెప్పారు. ఈరోజు(గురువారం)జులై 9న ఎన్టీఆర్ జిల్లాలోని కొండపల్లి బొమ్మల కళాకారులు, కాకినాడ జిల్లాలోని ఉప్పాడ చేనేత కార్మికులు, కడప జిల్లాలోని మాధవరం చేనేత కార్మికులు, అనంతపురం జిల్లాలోని యాడికి చేనేత కార్మికుల కోసం ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 10న విజయనగరం జిల్లాలోని బొబ్బిలి వీణ కళాకారులు, అనకాపల్లి జిల్లాలోని ఎటికొప్పాక కళాకారులు, ఏలూరు జిల్లాలోని హ్యాండ్ నాటెడ్ వూలెన్ పైల్ కార్పెట్ కళాకారులు, మదనపల్లె చేనేత కార్మికుల కోసం వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అలాగే, జులై 11న సత్యసాయి జిల్లాలోని ధర్మవరం చేనేత కార్మికులు, శ్రీకాకుళం జిల్లాలోని బుడితి ఇత్తడి కళాకారులు, కృష్ణా జిల్లాలోని పెడన బ్లాక్ కలంకారీ కళాకారులు, తిరుపతి జిల్లాలోని చెక్క శిల్ప కళాకారుల కోసం ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఏపీలోని మరిన్ని హస్తకళా, చేనేత కళాకారుల క్లస్టర్లలో ఇదే తరహాలో వైద్య శిబిరాలను దశలవారీగా కొనసాగిస్తామని పవన్ చెప్పారు. ఈ శిబిరాల ద్వారా సాధారణ ఆరోగ్య పరీక్షలతో పాటు అవసరమైన చోట నిపుణుల వైద్య సేవలు, నిర్ధారణ పరీక్షలు, తదుపరి చికిత్సకు అవసరమైన మార్గదర్శకత్వం అందించనున్నట్లు తెలిపారు. ప్రతి హస్తకళాకారుడు, ప్రతి చేనేత కార్మికుడు ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 'కళను గౌరవించడం అంటే కళాకారుడి శ్రమను గౌరవించడం. కళాకారుడి శ్రమను గౌరవించడం అంటే ఆయన ఆరోగ్యాన్ని కాపాడటం. కళాకారులు ఆరోగ్యంగా ఉంటేనే మన సంప్రదాయాలు, వారసత్వం భావితరాలకు సజీవంగా నిలుస్తాయి. కళను కాపాడాలంటే.. ముందు కళాకారుడిని కాపాడాలి' అని ఎక్స్‌లో పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

# పరిహారం ఇవ్వకుండా మత్స్యకారుల కుటుంబాలను వేధించిన వైసీపీ

(మొదటి పేజీ తరువాయి)

చేశారని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పెండింగ్ బిల్లులను కూటమి ప్రభుత్వం చెల్లించి బాధిత కుటుంబాలకు న్యాయం చేసిందని తెలిపారు. అలాంటి పరిస్థితులు సృష్టించిన జగన్ ఇప్పుడు మత్స్యకారుల గురించి మాట్లాడటం, తన సొంత పత్రికలో తప్పుడు రాతలు రాయించడం విడ్డూరంగా ఉందని, విమర్శలు చేసే ముందు తన ప్రభుత్వ హయాంలో జరిగిన అన్యాయాలను ఒక్కసారి గుర్తు చేసుకోవాలని మంత్రి అచ్చెన్నాయుడు సూచించారు. మత్స్యకారుల సంక్షేమం పేరుతో ప్రచారం చేసుకున్న మాజీ సియం జగన్ ప్రభుత్వం ఆచరణలో మాత్రం వారిని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. గత ప్రభుత్వం నుంచి పెండింగ్‌లో ఉన్న 63 ఎక్స్‌గ్రేషియా క్లెయిమ్‌లకు సంబంధించిన రూ.3.15 కోట్లను 2024 జూలై 8న విడుదల చేసి బాధిత కుటుంబాలకు అందజేశామని చెప్పారు. అలాగే ప్రభుత్వం లో పెండింగ్‌లో ఉన్న రూ.9.90 కోట్ల డీజిల్ (ఆయిల్) సబ్సిడీ బకాయిలను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 2024 జూన్ నెలలో విడుదల చేసి మత్స్యకారులకు అందించిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో మత్స్యకారులకు ఎప్పుడు అండగా ఉంటూ తగిన న్యాయం చేస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వం లాగా ఎటువంటి వైఫల్యాలు లేకుండా వారికి సంక్షేమ పథకాలను తూచా తప్పకుండా అందజేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికి చెందుతుందని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.ఇటీవల విశాఖపట్నం తీరంలో గల్లంతైన మత్స్యకారుల ఆచూకీ కోసం ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన విస్తృత గాలింపు చర్యలు చేపట్టిందన్నారు. భారత కోస్ట్ గార్డ్, భారత నౌకాదళం, కోస్టల్ సెక్యూరిటీ పోలీసులు, విశాఖపట్నం పోర్టు అథారిటీతో పాటు సంబంధిత అన్ని సంస్థల సమన్వయంతో నిరంతర గాలింపు కొనసాగించామని తెలిపారు. మత్స్యకారులు గల్లంతైన సమాచారం ప్రభుత్వానికి ఆలస్యంగా అందినప్పటికీ విషయం తెలిసిన వెంటనే యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి అత్యవసర చర్యలు ప్రారంభించామని చెప్పారు. అలాగే సాంకేతిక లోపం కారణంగా ఒడిశా తీరానికి సమీపంలో సముద్ర మధ్యలో చిక్కుకుపోయిన 10 మంది ఆంధ్రప్రదేశ్ మత్స్యకారులను ప్రభుత్వం అత్యంత వేగంగా స్పందించి సురక్షితంగా రక్షించిందని మంత్రి తెలిపారు. ఒడిశా ప్రభుత్వ అధికారులతో నేరుగా సమన్వయం చేసి సంబంధిత యంత్రాంగాన్ని రంగంలోకి దింపడం ద్వారా మత్స్యకారులను సురక్షితంగా ఒడ్డుకు చేర్చడమే కాకుండా, వారికి అవసరమైన వైద్య సహాయం అందించి అనంతరం క్షేమంగా విశాఖపట్నానికి తరలించామని వెల్లడించారు. మత్స్యకారుల ప్రాణాల రక్షణ కోసం ప్రభుత్వం నిరంతరం అప్రమత్తంగా పనిచేస్తుంటే, అలాంటి సమయంలో కూడా రెడ్డి ఈ అంశాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవడం బాధాకరమని మంత్రి అచ్చెన్నాయుడు విమర్శించారు. మత్స్యకారులకు భరోసా కల్పించాల్సిన సమయంలో వారిని రెచ్చగొట్టే విధంగా వ్యవహరించటం పూర్తిగా బాధ్యతారాహిత్యమన్నారు.గత ప్రభుత్వం హయాంలో ప్రమాదవశాత్తు మరణించిన మత్స్యకారుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచామని ప్రచారం చేసుకుందని, కానీ క్షేత్రస్థాయిలో ఆ సాయం సకాలంలో అందక బాధిత కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడ్డాయని మంత్రి పేర్కొన్నారు. గత ప్రభుత్వ పాలనలో సముద్ర వేటకు వెళ్లి ఎంతమంది మత్స్యకారులు ప్రాణాలు కోల్పోయారనే విషయంపై ఇప్పటివరకు ఒక అధికారిక శ్వేతపత్రం కూడా విడుదల చేయలేదని మంత్రి ప్రశ్నించారు. మత్స్యకారుల ఓట్ల కోసం 'భరోసా' పేరుతో ప్రచారం చేసిన గత పాలకులు వేటలో మరణించిన మత్స్యకారుల ఖచ్చితమైన సంఖ్యను ప్రజలకు ఎందుకు వెల్లడించలేదని నిలదీశారు. ప్రమాదవశాత్తు మరణించిన మత్స్యకారుల కుటుంబాలకు రూ.10 లక్షల పరిహారం ఇస్తామని వైసీపీ ప్రభుత్వం ప్రకటించినప్పటికీ, వచ్చిన క్లెయిమ్‌లలో అనేక దరఖాస్తులను బడ్జెట్ లేదనే కారణంతో సంవత్సరాల తరబడి పెండింగ్‌లో ఉంచిందని మంత్రి విమర్శించారు. మొదటి రెండేళ్లలో వచ్చిన 116 క్లెయిమ్‌లలో 52 క్లెయిమ్‌లను సుదీర్ఘకాలం పరిష్కరించకుండా వదిలేసిన విషయాన్ని గుర్తు చేశారు. సముద్ర తీర ప్రాంతాల్లో కనీస భద్రతా చర్యలు కల్పించడంలో వైసీపీ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని మంత్రి ఆరోపించారు. మరణాల సంఖ్య బయటపడితే ప్రభుత్వ వైఫల్యం బహిర్గతమవుతుందనే భయంతో అధికారిక సమాచారాన్ని ప్రజల ముందుకు తీసుకురాలేదని మంత్రి అచ్చెన్నాయుడు విమర్శించారు.

# ధాన్యం కొనుగోలులో రికార్డు

**విజయవాడ,మన జనప్రగతి జూలై 09:**గత రెండేళ్లుగా కూటమి ప్రభుత్వం ధాన్యం కొనుగోలులో వినూత్న సంస్కరణలను అమలు చేసిందని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. సివిల్ సప్లైస్ కార్పొరేషన్ ద్వారా రైతులు, రైస్ మిల్లర్ల మధ్య సమన్వయంతో కొనుగోలు ప్రక్రియ నిర్వహిస్తోందని తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మార్గదర్శకత్వంలో రాష్ట్ర చరిత్రలోనే అత్యుత్తమ ధాన్యం కొనుగోలు చేపట్టినట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వంలో రెండేళ్ల ధాన్యం సేకరణ విజయవంతంగా పూర్తవడంపై పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో రైతులు, రైస్ మిల్లర్లతో ప్రత్యేక సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ.. జిల్లా స్థాయిలో అధికారులు బాగా పని చేశారని కొనియాడారు. రానున్న సీజన్‌లో ఎల్‌నినో ప్రభావంపై రైతులకు అవగాహన కల్పిస్తామని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో 42 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా, కూటమి ప్రభుత్వం రెండో ఏడాదిలో 74 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసిందని వివరించారు. రూ.31 వేల కోట్ల విలువైన ధాన్యం కొనుగోలు చేసి, 11.53 లక్షల మంది రైతులకు 95 శాతం చెల్లింపులు 24 గంటల్లోనే చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లలో మధ్యాహ్న భోజన పథకానికి నాణ్యమైన బీపీటీ బియ్యం అందిస్తున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్ అమలు చేస్తున్న 10 శాతం బ్రోకెన్ రైస్ విధానాన్ని కేంద్ర ప్రభుత్వం గుర్తించి దేశవ్యాప్తంగా అమలు చేయాలని నిర్ణయించిందన్నారు. ప్రతి ధాన్యం బస్తాకు క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేసి, రైతు నుంచి ఫెయిర్ ప్రైస్ షాప్ వరకు పూర్తి వివరాలు తెలుసుకునే వ్యవస్థ ఏర్పాటు చేశామన్నారు. వాట్సాప్ ద్వారా రైతులు ధాన్యం విక్రయించుకునే సౌకర్యాన్ని కల్పించామని వెల్లడించారు. గన్నీ బ్యాగులు, గోదాములు, రవాణా, తేమ శాతం వంటి అంశాల్లో పారదర్శకత పెంచేందుకు చర్యలు తీసుకున్నామని నాదెండ్ల తెలిపారు. ఖరీఫ్ నుంచి రైతు సేవా కేంద్రాల్లోనే గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచామన్నారు. రవాణా జాప్యాన్ని నివారించేందుకు ట్రాన్స్‌పోర్ట్ ఖర్చులను కూడా 48 గంటల్లో రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నామని తెలిపారు. ఆర్‌ఎఫ్ఐడీ స్టిక్కర్లు, స్కానర్లతో లారీల కదలికలను పర్యవేక్షించే వ్యవస్థ అమలు చేస్తున్నామని చెప్పారు. తేమ కొలిచే మాయిశ్చర్ మీటర్లు అన్ని చోట్లా ఒకే కంపెనీ, ఒకే మోడల్‌లో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రస్తుతం 90 శాతం ఏర్పాటు పూర్తవగా, ఖరీఫ్ నాటికి 100 శాతం పూర్తి చేస్తామని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో ఈ సీజన్‌లో వరి ఉత్పత్తి సుమారు 15 శాతం తగ్గే అవకాశం ఉందని ప్రాథమిక అంచనాలు ఉన్నాయన్నారు. రైతులకు ముందస్తు అవగాహన కల్పించి, అవసరమైన సూచనలు అందించి సమస్యలను అధిగమించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టనున్నట్లు మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.

# ఐదేళ్ల వైసీపీ అరాచక పాలన వల్ల నష్టపోయిన రాష్ట్రం

(మొదటి పేజీ తరువాయి)

విమర్శలను తాము పట్టించుకోబోమని తెలిపారు. మచిలీపట్నం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. బందరు మండలం కానూరు శివారు చిన్న క్యాంప్ బెల్ గ్రామంలో నూతనంగా నిర్మించిన హెడ్ వాటర్ ట్యాంక్‌ను ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ సంక్షేమం, అభివృద్ధి బాటలో ముందుకు సాగుతామని మంత్రి వెల్లడించారు. బందరు పట్టణంలో ఇప్పటికే ఇంటింటికీ తాగునీరు సరఫరా చేస్తున్నామని, అదే రీతిలో గ్రామీణ ప్రాంతాల్లో సైతం ప్రతి ఇంటికీ సురక్షిత జలాలు అందించేందుకు జలజీవన్ మిషన్ కింద రూ.200 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. ఈ ప్రాంత రూపురేఖలను మార్చే ప్రతిష్ఠాత్మక బందరు పోర్టు పనులను వేగవంతం చేసి, వచ్చే ఏడాది ఆరంభంలోనే ప్రారంభిస్తామని ప్రకటించారు. దీని ద్వారా మచిలీపట్నం ప్రాంతం పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చెందుతుందని, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని మంత్రి కొల్లు రవీంద్ర ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులు, అధికారులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఏపిఎస్ఆర్టీసిని ప్రైవేటీకరణ చేసే ప్రసక్తే లేదు

**అమరావతి, మన జనప్రగతి జూలై 09:** ఏపిఎస్ఆర్టీసి ని ప్రైవేటీకరణ చేసే ప్రస్తక్తే లేదని, విద్యుత్ బస్సులతో ఆధునిక ప్రజా రవాణా వ్యవస్థను ఏర్పాటు చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి స్పష్టం చేశారు. ఏపిఎస్ఆర్టీసి ప్రైవేటీకరణ జరుగుతుందన్న ప్రచారం పూర్తిగా నిరాధారమని, సంస్థ ఆస్తులు, డిపోలు, భూములు ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రైవేట్ సంస్థలకు బదిలీ చేయబోవడం లేదన్నారు. ఈ విషయంలో ఉద్యోగ సంఘాలతో సంపూర్ణ సంప్రదింపులు కొనసాగిస్తూ అందరికీ ఆమోదయోగ్యమైన విధానాన్ని ప్రభుత్వం రూపొందిస్తుందని తెలిపారు. ఉద్యోగులు, ప్రజలు ఎలాంటి అపోహలకు లోనుకాకుండా వాస్తవాలను మాత్రమే విశ్వసించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.విద్యుత్ బస్సులను ప్రవేశపెట్టడంపై కొన్ని వర్గాలు, ఉద్యోగ సంఘాలు వ్యక్తం చేస్తున్న సందేహాలు, మీడియాలో వస్తున్న పలు కథనాల నేపథ్యంలో గురువారం రాష్ట్ర సచివాలయం ప్రచార విభాగంలో పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ పలు అంశాలపై సమగ్ర వివరణ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా రవాణా వ్యవస్థను మరింత ఆధునికీకరించడం, పర్యావరణ హితంగా తీర్చిదిద్దడం, ప్రయాణికులకు అత్యుత్తమ సౌకర్యాలు కల్పించడం లక్ష్యంగా విద్యుత్ బస్సులను ప్రవేశపెట్టే కార్యక్రమాన్ని పారదర్శకంగా అమలు చేస్తోందని తెలిపారు.

# రాజముద్రతో పాసుపుస్తకాలు రైతులు అస్తికి పూర్తి చట్టభద్రత

(మొదటి పేజీ తరువాయి)

వివిధ ప్రభుత్వ సేవలు, బ్యాంకు రుణాలు మరియు ఇతర అవసరాలు కోసం సులభంగా వినియోగించుకోవచ్చునని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, భూ రికార్డులు నిర్వహణలో పారదర్శకత, విశ్వసనీయతను మరింత పెంపొందించేందుకు పలు సంస్కరణలు అమలు చేస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. రైతులు తమ భూములకు సంబంధించిన రికార్డులను ఎప్పటికప్పుడు సరిచూసుకుని అవసరమైతే సంబంధిత అధికారులను సంప్రదించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో తహశీల్దారు పి.యన్.వి.ప్రసాదు, వివిధ శాఖలు అధికారులు, ఏయంసి ఛైర్మన్ కుంపటి అరుణ, రెవిన్యూ, అగ్రికల్చర్ మార్కెటు కమిటీ ఉద్యోగులు, మార్కెటు యార్డు డైరెక్టర్లు, ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకులు, కూటమి నాయకులు రైతులు, స్థానిక ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ రాజ్యసభ నేతగా వద్దిరాజు

(మొదటి పేజీ తరువాయి)

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా వద్దిరాజు రవిచంద్రను ఫ్లోర్ లీడర్‌గా నియామకం పట్ల తెలంగాణ మున్నూరు కాపు సంఘం నాయకులు పార్టీ అధినేత కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. వద్దిరాజు నియామకం బీసీల, తెలంగాణ హక్కుల సాధనలో కీలకంగా మారుతారని సంఘం అధ్యక్షుడు సర్దార్ పుటం పురుషోత్తం పటేల్ అన్నారు. వద్దిరాజు రవిచంద్ర సేవలను గుర్తించి కీలకమైన బాధలు అప్పగించిన కేసీఆర్‌కు మున్నూరు కాపు సమాజం కృతజ్ఞతలు తెలుపుతుందని అన్నారు. తెలంగాణ రాష్ట్రానికి రావలసిన రాజ్యాంగపరమైన హక్కుల సాధనలో వద్దిరాజు కృషి మరింత పెరగడానికి అవకాశం దక్కిందని పేర్కొన్నారు.

మనజనప్రగతి

10 - 07 - 2026

# మైనార్టీ జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి






**కర్నూలు బ్యూరో మన జనప్రగతి జూలై 09:–** మైనార్టీ యువత కోసం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే మెగా జాబ్ మేళాను కర్నూలు జిల్లా మైనార్టీ యువత సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మైనార్టీ శాఖ అధికారి సయ్యద్ సబిహా పర్వీన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె పత్రికా ప్రకటనలో మాట్లాడుతూ అమరావతిలో ఈనెల 11 తేదీన ఉదయం 9 గంటలకు ఈ జాబ్ మేళా అమరావతిలో నిర్వహిస్తున్నారు అన్నారు. ఈ జాబ్ మేళాలో ఐటీ, బ్యాంకింగ్, ఫైనాన్స్, హెల్త్, లాజిస్టిక్, రిటైల్ రంగాల్లో ఉద్యోగ అవకాశాలు ఉంటాయన్నారు. దాదాపు 2500 నుంచి 3,000 మంది ముస్లిం మైనార్టీ యువతకు ఈ ఉద్యోగావకాశాలు పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. పదవ తరగతి ఇంటర్ డిగ్రీ మరియు సాంకేతిక విద్య చదివిన వారు ఈ ఉద్యోగాలకు అర్హులని తెలిపారు. ఆసక్తి గలవారు క్యూఆర్ కోడ్ లో తమ బయోడేటాను నమోదు చేసుకోవాలని కోరారు. ఇంటర్వ్యూకు హాజరు కావలసినవారు విజయవాడలోని షాజహూర్ ముషఫిర్ ఖానా, ఇస్లాంపేట రైల్వే స్టేషన్ 10వ నెంబర్ ప్లాట్ఫారం దగ్గర, వన్ టౌన్ విజయవాడ చిరునామాకు హాజరుకావాలన్నారు.

# ఆదోని నూతన ఆర్డీవోగా బాధ్యతలు స్వీకరించిన కె.అరుణా దేవి.



**ఆదోని మన జనప్రగతి జూలై 09:–**కర్నూలు జిల్లా ఆదోని నూతన రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీవో) గా కె. అరుణా దేవి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ సిరి ని, జాయింట్ కలెక్టర్ నూరుల్ కమ్మర్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటనారాయణమ్మను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు ఆమె పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా అభివృద్ధి, పరిపాలనాంశాలపై కలెక్టర్ నూతన ఆర్డీవోకు పలు సలహాలు, సూచనలు చేశారు.

# న్యాయవాద వృత్తిలో రాణించి మంచి పేరు సంపాదించాలి



**పత్తికొండ మన జనప్రగతి జూలై 09:–**న్యాయవాద వృత్తిలోకి కొత్తగా అడుగుపెడుతున్న యువ న్యాయవాదులు సీనియర్ల సలహాలు, సూచనలను పాటిస్తూ అంకితభావంతో పనిచేస్తే వృత్తిలో రాణించి మంచి పేరు సంపాదించవచ్చని సీనియర్ న్యాయవాదులు కారప్ప, ఎల్లారెడ్డి, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు మధుబాబు పేర్కొన్నారు.కర్నూలు జిల్లా పత్తికొండ న్యాయవాదుల సంఘంలో గురువారం కే. రామాంజనేయులు న్యాయవాద వృత్తిలోకి కొత్తగా సభ్యత్వం పొందారు. ఈ సందర్భంగా న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు మధుబాబు ఆయనకు సభ్యత్వ పత్రాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, కొత్తగా ప్రాక్టీస్ ప్రారంభించే న్యాయవాదులు కోర్టు విధివిధానాలు, కేసుల నిర్వహణపై అవగాహన పెంపొందించుకోవడంతో పాటు సీనియర్ న్యాయవాదుల మార్గదర్శకత్వాన్ని అనుసరించాలని సూచించారు. క్రమశిక్షణ, నిజాయితీ, నిబద్ధతతో పనిచేస్తే వృత్తిలో విశిష్ట గుర్తింపు పొందవచ్చని అన్నారు.అనంతరం కొత్త సభ్యుడైన కే. రామాంజనేయులకు సీనియర్, జూనియర్ న్యాయవాదులు పుష్పగుచ్చాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

# చిట్వేలి హైస్కూల్‌లో ఎన్‌సీసీ ప్రవేశ నమోదు



**చిట్వేలి మన జనప్రగతి జూలై 09:–**చిట్వేలి పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎన్‌సిసి ట్రూప్ 202627 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఎన్‌సీసీ ప్రవేశ నమోదు కార్యక్రమం నిర్వహించారు. 30వ ఆంధ్ర బెటాలియన్ ఎన్‌సిసి ఏవో లెఫ్టినెంట్ కల్నల్ లలిత్ బాబు ఆధ్వర్యంలో 32 మంది జూనియర్ డివిజన్, 18 మంది జూనియర్ వింగ్ క్యాడెట్లను ఎంపిక చేయగా, అదనంగా 8 మంది రిజర్వ్ క్యాడెట్లను ఎంపిక చేశారు.లెఫ్టినెంట్ కల్నల్ లలిత్ బాబు మాట్లాడుతూ...ఎన్‌సీసీ విద్యార్థుల్లో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, దేశభక్తి, సేవాభావం,ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే అత్యుత్తమ యువజన సంస్థ అని అన్నారు.ఎన్‌సీసీ ద్వారా విద్యార్థులకు సైనిక శిక్షణతో పాటు జాతీయ సమైక్యత, సామాజిక బాధ్యత, విపత్తుల సమయంలో సేవా దృక్పథం అలవడుతుందని వివరించారు. భవిష్యత్తులో రక్షణ దళాలు, పోలీసు శాఖ, ఇతర పోటీ పరీక్షల్లో ఎన్‌సీసీ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని సూచించారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు దుర్గరాజు,ఎన్సిసి అధికారి పసుపుల రాజశేఖర్ విద్యార్థులను అభినందిస్తూ, పాఠశాల ఎన్‌సీసీ ట్రూప్ రాష్ట్ర, జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సుబేదార్ దిలీప్ పాల్, బీహెచ్‌ఎం బాలకృష్ణ, హవల్దార్ వరహాలు, స్వాతి, కిరణ్ కుమార్, చలమారెడ్డి, భాష, నాయక్, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# రూ.102.91 కోట్లతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారుస్తాం

## 'మన బడిమన భవిష్యత్తు' పనులపై జిల్లా కలెక్టర్ డా. ఎ. సిరి సమీక్ష

## అంచనాలు వేగంగా పూర్తి చేసి పనులు ప్రారంభించాలని అధికారులకు ఆదేశం




**కర్నూలు బ్యూరో మన జనప్రగతి జూలై 09:–**జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల మౌలిక వసతులను సమగ్రంగా అభివృద్ధి చేసి విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడమే లక్ష్యంగా రూ.102.91 కోట్లతో చేపట్టనున్న 'మన బడిమన భవిష్యత్తు' కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డా. ఎ. సిరి అధికారులను ఆదేశించారు. గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో పనుల పురోగతిపై చర్చించారు.కలెక్టర్ మాట్లాడుతూ ప్రధాన, చిన్న మరమ్మతులు, మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయాలు, రంగులు వేయడం, ద్వంద్వ బెంచీలు తదితర పనులకు రూ.21.91 కోట్లు, ప్రాథమిక ఆదర్శ పాఠశాలల అభివృద్ధికి రూ.81 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. మొత్తం రూ.102.91 కోట్లతో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చేలా చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు.పాఠశాలల్లో విద్యార్థులకు ఆహ్లాదకరమైన, పరిశుభ్రమైన వాతావరణం కల్పించేందుకు పది ప్రధాన అంశాలపై అంచనాలను త్వరగా పూర్తి చేసి పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. ప్రధానోపాధ్యాయులు, ఇంజనీరింగ్ అధికారులు సమన్వయంతో క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి మాత్రమే అంచనాలు రూపొందించాలని, అనంతరం మార్పులకు అవకాశం ఉండదని స్పష్టం చేశారు.పాఠశాలల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు విస్తృతంగా మొక్కలు నాటాలని సూచించారు. మౌలిక వసతుల పనుల్లో నాణ్యతా ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని, మూడో పక్షం ద్వారా కూడా నాణ్యతా పరిశీలన నిర్వహిస్తామని తెలిపారు.జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు, విద్యార్థుల సంఖ్య అధికంగా ఉన్నందున ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, శిథిలావస్థలో ఉన్న భవనాల తొలగింపు, అదనపు తరగతి గదుల నిర్మాణ అవసరాలపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.సమావేశంలో సమగ్ర శిక్ష ప్రాజెక్టు అధికారి లోకనాథ్, గ్రామీణ నీటి సరఫరా శాఖ ప్రధాన ఇంజినీర్ మనోహర్, పంచాయతీరాజ్ ప్రధాన ఇంజినీర్ ప్రభాకర్ రెడ్డి, మండల విద్యాశాఖ అధికారులు, మండల అభివృద్ధి అధికారులు, మున్సిపల్, ఇంజినీరింగ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# హామీలను నెరవేర్చి అభివృద్ధి పనులను ప్రజలకు అంకితం చేస్తున్నాం: ఎమ్మెల్యే కె.ఈ. శ్యామ్ కుమార్

**పత్తికొండ మన జనప్రగతి జూలై 09:–**పత్తికొండ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని, ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందని ఎమ్మెల్యే కె.ఈ. శ్యామ్ కుమార్ తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్య, వైద్యం, రహదారులు,వంతెనలు, సంక్షేమ వసతుల కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు.గురువారం కృష్ణగిరి మండలం కటారుకొండ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన బీసీ హాస్టల్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే, అనంతరం చిట్యాల గ్రామంలో నిర్మించిన సీసీ రోడ్డును ప్రజలకు అంకితం చేశారు. కోయిలకొండ గ్రామంలో మహర్షి వాల్మీకి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి, విలేజ్ హెల్త్ క్లినిక్‌తో పాటు సీసీ రోడ్డును ప్రారంభించారు.తదుపరి కోయిలకొండకంబాలపాడు గ్రామాల మధ్య నిర్మించిన నూతన వంతెనను ప్రారంభించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ, గత ప్రభుత్వం ఈ వంతెన నిర్మాణానికి హామీ ఇచ్చినా పూర్తి చేయడంలో విఫలమైందని విమర్శించారు.అలాగే తుగ్గలి మండలం బొందిమడుగుల వంతెన కూడా గత ప్రభుత్వ హామీలకే పరిమితమైందన్నారు. ప్రజల



అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ రెండు వంతెనలను కూటమి ప్రభుత్వం పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చిందని చెప్పారు.అనంతరం పెనుమడ గ్రామంలో నూతన సీసీ రోడ్డును ప్రారంభించిన ఎమ్మెల్యే, కంబాలపాడు గ్రామంలోని ఎస్సీ హాస్టల్‌లో ప్రభుత్వ నిధులతో చేపట్టిన సమగ్ర మరమ్మత్తు పనులను పూర్తి చేసి, విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఆధునీకరించిన హాస్టల్‌ను విద్యార్థులకు అంకితం చేశారు. అనంతరం కంబాలపాడు గ్రామంలో సీసీ రోడ్డుతో పాటు శ్మశానవాటిక మార్గంలో నిర్మించిన నూతన వంతెనను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గత ప్రభుత్వం హామీలకే పరిమితమైతే కూటమి ప్రభుత్వం చేతలతో ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటోందన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చడమే తమ ప్రభుత్వ లక్ష్యమని, అసంపూర్తిగా ఉన్న అభివృద్ధి పనులన్నింటినీ పూర్తి చేసి ప్రజలకు అంకితం చేస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమాల్లో జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, వివిధ శాఖల అధికారులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువత, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సిద్ధవటం వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం

- చైర్‌పర్సన్‌గా తమ్మిశెట్టి శ్రీలేఖ బాధ్యతల స్వీకారం
- రైతు సేవే లక్ష్యంగా పనిచేయాలని నేతల పిలుపు



**సిద్ధవటం మన జనప్రగతి జూలై 09:–**సిద్ధవటం వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకార మహోత్సవం గురువారం మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కూటమి పొత్తులో భాగంగా జనసేన పార్టీకి చెందిన దేరంగుల శ్రీకాంత్ సతీమణి తమ్మిశెట్టి శ్రీలేఖ చైర్‌పర్సన్‌గా, టీడీపీకి చెందిన పార్ల సంజీవరాయుడు వైస్‌చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. అలాగే సిద్ధవటం, ఒంటిమిట్ట మండలాలకు చెందిన డైరెక్టర్లు కూడా బాధ్యతలు స్వీకరించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీడీపీ రాజంపేట అసెంబ్లీ ఇన్‌చార్జి చమర్తి జగన్ మోహన్ రాజు, జనసేన పార్టీ రాజంపేట పార్లమెంట్ సమన్వయకర్త అతికారి కృష్ణ హాజరయ్యారు. వారికి కూటమి నాయకులు, కార్యకర్తలు బాణాసంచా, డీజే వాయిద్యాలు, గజమాలలతో ఘన స్వాగతం పలికి సత్కరించారు. ఈ సందర్భంగా అతికారి కృష్ణ మాట్లాడుతూ నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, రైతులకు అందుబాటులో ఉంటూ పారదర్శకంగా, సమర్థవంతంగా పనిచేసి మార్కెట్ కమిటీకి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కూటమి నాయకులు ఐక్యంగా పనిచేసి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయాన్ని సాధించాలని పిలుపునిచ్చారు. చమర్తి జగన్ మోహన్ రాజు మాట్లాడుతూ రైతుల సమస్యల పరిష్కారమే మార్కెట్ కమిటీ ప్రధాన లక్ష్యంగా ఉండాలని సూచించారు. కూటమి నాయకులు ఐకమత్యంతో ముందుకు సాగాలని, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా పనిచేయాలని కోరారు.



నూతన చైర్‌పర్సన్ తమ్మిశెట్టి శ్రీలేఖ, దేరంగుల శ్రీకాంత్ దంపతులు మాట్లాడుతూ తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, పార్టీ నాయకులు అతికారి కృష్ణ, చమర్తి జగన్ మోహన్ రాజులకు కృతజ్ఞతలు తెలిపారు. తమపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ రైతుల సంక్షేమం, మార్కెట్ కమిటీ అభివృద్ధి కోసం కృషి చేస్తామని, కూటమి బలోపేతానికి అంకితభావంతో పనిచేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఒంటిమిట్ట జెడ్పీటీసీ ముద్దు కృష్ణారెడ్డి, రాజంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ గన్నే సుబ్బనరసయ్య, ఒంటిమిట్ట సింగిల్ విండో అధ్యక్షుడు మాడా జయకృష్ణ, సిద్ధవటం టీడీపీ ఇన్‌చార్జి రాజశేఖర్ యాదవ్, క్లస్టర్ ఇన్‌చార్జి రాజా నాయుడు, టిడిపి పార్లమెంట్ ఉపాధ్యక్షుడు నాగమునిరెడ్డి, జనసేన పార్టీ సీనియర్ నాయకుడు గీతాంజలి రమణ, మార్కెట్ కమిటీ కార్యదర్శి టి. సుజాత, డైరెక్టర్లు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## చిన్నకుడాల గ్రామంలో బిటెక్ రవి



**లింగాల మన జనప్రగతి జూలై 09:-**మండల పరిధిలోని చిన్నకుడాల గ్రామంలో పులివెందుల టిడిపి ఇన్చార్జి బీటెక్ రవి గురువారం పర్యటించారు. చిన్న కుడాల గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు గంగిరెడ్డి తండ్రి ఎల్లారెడ్డి ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీటెక్ రవి గురువారం గంగిరెడ్డి ఇంటికి వెళ్లి కుటుంబాన్ని పరామర్శించారు.అలాగే అదే గ్రామానికి చెందిన పురుషోత్తం రెడ్డి, బాబురెడ్డి ఆహ్వానం మేరకు వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యుల యోగక్షేమమాలను అడిగి తెలుసుకున్నారు. లింగాల టిడిపి టిడిపి మండల అధ్యక్షుడు విశ్వనాథ్ రెడ్డి, పులివెందుల మార్కెట్ యార్డ్ చైర్మన్ గడ్డం అమర్నాథ్ యాదవ్, వేంపల్లి టిడిపి ఇంచార్జ్ రఘునాథరెడ్డి తోపాటు టిడిపి నాయకులు,కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## ఘనంగా ఊరిటీ వెంకట్రావు జన్మదిన వేడుకలు



**శేరిలింగంపల్లి మన జన ప్రగతి జులై 09:-**ఊరిటీ వెంకట్రావు జన్మదినాన్ని పురస్కరించుకొని శేరీలింగంపల్లి నియోజక వర్గం పరిధిలోని తారా నగర్ శివాజీ నగర్ వీకర్ సెక్షన్ కాలనీలో గల శ్రీ కట్ట మైసమ్మ దేవాలయం 12వ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక హోమాలు పూజలు నిర్వహించారు. అన్నప్రసాదాలు కార్యక్రమాలు నిర్వహించారు.పూజా కార్యక్రమంలో పాల్గొని ఊరిటీ వెంకటేశ్వరరావు కి శుభాకాంక్షలు తెలిపినారు యాదవ కురుమ కార్పొరేషన్ చైర్మన్ మారబోయిన రఘునాథ్ యాదవ్ భేరి రామచంద్ర యాదవ్ కట్ట మైసమ్మ అమ్మవారి కరుణాకటాక్షాలు నిండుగా ఉండాలని నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని ఇంకా ప్రజలకు సేవ చేయాలని మనస్ఫూర్తిగా అమ్మవారిని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ వీరేశం గౌడ్, బిల్డర్ రాఘవరావు, కుశాల్ రెడ్డి, సురేందర్ రెడ్డి, నరేందర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, బీసీ నాయకులు సుధాకర్, మరియు పెద్ద త్తున ప్రజా ప్రతినిధులు మహిళా సోదరులు యువజన నాయకులు పాల్గొన్నారు.

## జి.ఓ నెం:673, 975లను వెంటనేఉపసంహరించాలి

**- షేక్ మహబూబ్ బాషా డిమాండ్.**



**పీలేరు మన జనప్రగతి జూలై 09:-**ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జారీ చేసిన జి.ఓ నెం. 673, 975ల ద్వారా మున్సిపల్ సేవలను ప్రైవేటీకరించే నిర్ణయం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని ఆంధ్రప్రదేశ్ స్టేట్ మైనారిటీ వైస్ చైర్మన్ షేక్ మహబూబ్ బాషా అన్నారు.ఈ సందర్భంగాషేక్ మహబూబ్ బాషా మాట్లాడుతూ.. కార్మికుల సంక్షేమాన్ని పక్కనబెట్టి ప్రైవేటీకరణ పేరుతో వేలాది కుటుంబాలను ఆర్థిక అనిశ్చితిలోకి నెట్టడం అత్యంత బాధాకరమని అన్నారు.ప్రభుత్వం వెంటనే తన వైఖరిని మార్చుకుని జి.ఓ నెం. 673, 975లను ఉపసంహరించుకోవాలి. మున్సిపల్ కార్మికులతో, కార్మిక సంఘాలతో చర్చలు జరపాలి.ఖాళీ పోస్టులను శాశ్వత నియామకాలతో భర్తీ చేయాలి.కార్మికుల హక్కులు, ఉద్యోగ భద్రతకు పూర్తి హామీ ఇవ్వాలి.కార్మికుల చెమటతో నడిచే వ్యవస్థను కార్పొరేట్ లాభాలకు బలిచేయవద్దని ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వం ప్రజల స్వరాన్ని వినాలని కార్మికుల న్యాయమైన పోరాటానికి కాంగ్రెస్ పార్టీ, మైనారిటీ విభాగం అండగా నిలుస్తుందని అన్నారు. గ్రామ పంచాయతీల పారిశుద్ధ్య కార్మికులకుకూడా భద్రత కల్పించే అంశం కూడా పరిగణలోనికి తీసుకోవాలని అన్నారు.

## రంగారెడ్డి జిల్లా అర్బన్ అధికార ప్రతినిధులుగా ఆంజనేయులు సాగర్



**శేర్లింగంపల్లి మన జనప్రగతి జూన్ 09:-**భారతీయ జనతా పార్టీ కార్యాలయం మసీదు బండ,కొండాపూర్ లో నూతనంగా నియమింపబడిన రంగారెడ్డి అర్బన్ జిల్లా అధికార ప్రతినిధులను కంటెస్టెడ్ ఎమ్మెల్యే రవికుమార్ యాదవ్ సమక్షంలో శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ బాధ్యతను నిజాయితీ ,క్రమశిక్షణతో నిర్వహించి అందరిని కలుపుకొని పార్టీ ప్రతిష్టను పెంచి, పార్టీ ఎదుగుదలకు మార్గ ,నిర్దేశం చేస్తూ వ్యూహాత్మకమైన ప్రణాళికలతో ముందుకు సాగుతూ ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూ పార్టీ సంస్థాగత ఎదుగుదలకు కృషి చేయాలని రవి కుమార్ యాదవ్ తెలియజేస్తూ .పార్టీలో కష్టపడి పనిచేసే వారికి తగిన గుర్తింపు లభిస్తుందని కార్యకర్తలకు సూచించారు.మాపై నమ్మకం ఉంచి బాధ్యతాయుతమైన పదవులు అప్పజెప్పినందుకు పార్టీ అధిష్టానానికి విధేయులుగా ఉంటూ, అందరితో కలగొలుపుగా మెదులుకొని, పార్టీ సూచించిన కార్యక్రమంలో చురుకుగా పాల్గొని , పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని హామీ వస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కనకయ్య, శ్రీనివాసులు,వేణు,వేణుగోపాల స్వామి,పద్మ, సైదమ్మ, ,నర్సింగ్, చందు ,ఆంజనేయులు, రత్నకుమార్ మొదలవారు పాల్గొన్నారు.

## బికేఆర్ గ్రాండ్ ఇన్ లాడ్జినీ ప్రారంభించిన ఎమ్మెల్యే మాధవి రెడ్డి



**కడప మన జనప్రగతి జూలై 09:-**నగరంలోని పాత బస్టాండ్ వద్ద పూల అంగళ్లు వెనక భాగంలో బి .కే .ఆర్. గ్రాండ్ ఇన్ లాడ్జిని మాజీ కార్పొరేటర్ బాలకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో కడప శాసన సభ్యురాలు మాధవరెడ్డి ,తెలుగుదేశం పార్టీ కోఆర్డినేటర్ శ్రీనివాసులు రెడ్డి, ఎమ్మెల్సీ బీటెక్ రవి ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణానికి వచ్చే కొత్త వ్యక్తులకు కావలసిన అన్ని సౌకర్యాలతో కూడిన లగ్జరీస్ లాడ్జిని ప్రారంభించడం సంతోషించ తగిన విషయం అన్నారు. యజమానితోపాటు వచ్చే డ్రైవర్లకు మాత్రము ఉచిత రూములు కల్పించామని, వారు స్నానం చేసుకోవడానికి తగిన సౌకర్యాలు అనుకూలంగా విశాలమైన రూములు కలవారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. లాడ్జి యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మాజీ కార్పొరేటర్ సుబ్బారెడ్డి , బోనం శిలాస్, సుబ్బరాయుడు, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

## కమలాపురంలో రైళ్ల నిలుపుదల కోసం భారీ ర్యాలీ

- ప్యాసింజర్ రైళ్లకు నిలుపుదల కల్పించాలని డిమాండ్
- స్టేషన్ మాస్టర్‌కు వినతిపత్రం అందజేసిన సాధన కమిటీ




**కడప మన జనప్రగతి జూలై 09:-**కమలాపురం రైల్వే స్టేషన్‌లో ప్యాసింజర్ రైళ్లకు నిలుపుదల కల్పించాలని డిమాండ్ చేస్తూ రైళ్ల నిలుపుదల సాధన కమిటీ ఆధ్వర్యంలో గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ రైల్వే స్టేషన్ వరకు కొనసాగింది. ఈ ర్యాలీలో ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు, వివిధ సేవా సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా సాధన కమిటీ సభ్యులు మాట్లాడుతూ కమలాపురం రైల్వే స్టేషన్‌లో రైళ్ల నిలుపుదల లేకపోవడంతో విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, సాధారణ ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్యాసింజర్ రైళ్లకు ఇక్కడ నిలుపుదల కల్పిస్తే కమలాపురంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు ప్రయాణ సౌకర్యం మరింత మెరుగుపడుతుందని పేర్కొన్నారు.ర్యాలీలో పాల్గొన్న ప్రజలు రైళ్ల నిలుపుదలకు అనుకూలంగా నినాదాలు చేస్తూ తమ డిమాండ్‌ను వ్యక్తం చేశారు. అనంతరం రైల్వే స్టేషన్‌కు చేరుకుని స్టేషన్ మాస్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని కమలాపురం స్టేషన్‌లో వెంటనే ప్యాసింజర్ రైళ్లకు నిలుపుదల కల్పించాలని వినతిపత్రంలో కోరారు.సుమారు రెండు వేల మంది ప్రజలు పాల్గొన్న ఈ ర్యాలీకి విశేష స్పందన లభించింది. రైల్వే అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని సాధన కమిటీ సభ్యులు కోరారు. డిమాండ్ నెరవేరే వరకు తమ ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో సాధన కమిటీ సభ్యులు జి. సురేష్, దివాకర్ రెడ్డి, ఖాదర్ బాషా, గంగాధర్ రెడ్డి, రాఘవ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పిఎండిఎస్ క్షేత్రాల శాస్త్రవేత్తల సందర్శన



**చెన్నూరు మన జనప్రగతి జులై 09:-**చెన్నూరు మండల పరిధిలోని బయనపల్లి గ్రామంలో మరియు ఖాజీపేట పరిధిలో చమళ్ళపల్లి ముళ్లపాక గ్రామాలలో ప్రీ మాన్సూన్ రైస్ సోయింగ్ పద్ధతిలో సాగుచేసిన క్షేత్రాలను గురువారం వ్యవసాయ శాస్త్రవేత్తలు సందర్శించారు.ఈ సందర్శనలో శాస్త్రవేత్తలు ఈ పద్ధతిలో సాగు చేసిన పలు రకాల పంటల గురించి విత్తనం వేసిన పద్ధతి గురించి మరియు వాటిలో చేపట్టిన యాజమాన్యాల గురించి వివరాలు సేకరించారు.ఈ కార్యక్రమంలో డా.సుబ్రమణ్యం శాస్త్రవేత్త సేద్య విభాగం వ్యవసాయ పరిశోధనా స్థానముడా.యెన్ కృష్ణ ప్రియ సమన్వయకర్త, ఏరువాక కేంద్రం కడపడా.వి.శిల్పకళ సీనియర్ శాస్త్రవేత్త మరియు అధిపతిడా.కే సాయి మహేశ్వరీ శాస్త్రవేత్త సేద్య విభాగం కృషి విజ్ఞాన కేంద్రం,ఊటుకూరు సందర్శించడం జరిగింది

## ఎడారి దేశాల్లో మహానేతకు ఘన నివాళులు

- గల్ఫ్ దేశాల్లో వైఎస్ రాజశేఖర రెడ్డి 77వ జయంతి నిర్వహణ
- సేవలను స్మరించుకున్న వైఎస్సార్సీపీ నాయకులు,అభిమానులు




**కడప మన జనప్రగతి జూలై 08:-**దివంగత ముఖ్యమంత్రి, మహానేత డాక్టర్ వై.యస్. రాజశేఖర రెడ్డి 77వ జయంతి సందర్భంగా గల్ఫ్ దేశాల్లోని వైఎస్సార్సీపీ నాయకులు,అభిమానులు ఘనంగా నివాళులర్పించారు.గల్ఫ్ కన్వీనర్ ఇలియాస్ తెలిపిన వివరాల ప్రకారం కువైట్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఖతార్, సౌదీ అరేబియాలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి మహానేత సేవలను స్మరించుకున్నారు.కువైట్‌లో కన్వీనర్ ముమ్మడి బాలిరెడ్డి ఆధ్వర్యంలో కమిటీ సభ్యుల సహకారంతో జయంతి కార్యక్రమం నిర్వహించారు.యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో సుధాకర్ రెడ్డి, సోమిరెడ్డి పర్యవేక్షణలో, యూఏఈ వైఎస్సార్సీపీ కన్వీనర్ సయ్యద్ అక్రమ్, జీసీసీ సహ కన్వీనర్ మహమ్మద్ జిలాన్ బాషా, విద్యాసాగర్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు.ఖతార్‌లో పితాని శీను, అబ్దుల్ అలీమ్ సహకారంతో గల్ఫ్ సహ కన్వీనర్ డి. శశికిరణ్, ఖతార్ కన్వీనర్ జాఫర్ హుసేన్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. అలాగే సౌదీ అరేబియాలో రియాద్ కన్వీనర్ డాక్టర్ రబ్బానీ, జుబైల్ కన్వీనర్ షేక్ ఇలాహి ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహించి మహానేత చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.ఈ సందర్భంగా వై.యస్. రాజశేఖర రెడ్డి రైతులు, పేదలు, విద్యార్థులు, మహిళల సంక్షేమం కోసం అమలు చేసిన పథకాలను గుర్తు చేసుకుంటూ, ఆరోగ్యశ్రీ వంటి ప్రజా సంక్షేమ కార్యక్రమాలతో ఆయన ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని నాయకులు పేర్కొన్నారు.

## ప్రజా సమస్యలపై తక్షణమే చర్యలు చేపట్టండి


- సర్వసభ్య సమావేశంలో జడ్పీటిసి మాచిరెడ్డి రవికుమార్ రెడ్డి




**వేంపల్లె మన జనప్రగతి జులై 09:-**మండలం లోని ప్రజల సమస్యలపై సంబంధిత అధికారులు తక్షణమే పరిష్కారానికి చర్యలు చేపట్టాలని జడ్పీటిసి మాచిరెడ్డి రవికుమార్ రెడ్డి అన్నారు.గురువారం స్థానిక ఎంపిడిఓ సభ భవనంలో సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. సంబంధిత శాఖల అధికారులు తమ నివేదికలను చదివి వినిపించారు. ప్రధానంగా తాగునీరు, పారిశుధ్యం, డ్రైనేజీ, వీధి దీపాలు, ఆరోగ్యం, సిజనల్ వ్యాధులపై అధికారులు చొరవ చూపి పరిష్కార చర్యలు తీసుకోవాలని ప్రజాప్రతినిధులు సభ దృష్టికి తీసుకెళ్లారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలు, మౌలిక వసతులు, ఇతరత్రా వాటిపై మెడికల్ ఆఫీసర్ జోయల్ వెస్లీ తో జడ్పీటిసి ఆరాతీసారు. నియోజకవర్గంలోనే వేంపల్లె మండలం అధిక జనాభా కలిగి ఉందని, వైద్యం కోసం వచ్చే ప్రజల పట్ల శ్రద్ధ వహించాలని, వీరికి సేవలందించడంలో ఎలాంటి అలసత్వం వహించకూడదని జడ్పీటిసి సూచించారు. అంతేకాకుండా సిజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండి, ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా గత 6 నెలల నుంచి విద్యుత్ శాఖలో రెగ్యులర్ ఏఇ లేనందున రైతులు, విద్యుత్ వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గుర్తు చేశారు. వీటిపై జిల్లా స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని సభా ముఖంగా జడ్పీటిసి విన్నవించారు. ఉపాధి హామీ పనుల్లో ఎలాంటి అవకతవకలు జరగకుండా చూడాలని సంబంధిత అధికారికి జడ్పీటిసి సూచించారు. ప్రధానంగా పాఠశాలలు, బహిరంగ ప్రదేశాల్లో అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ఎస్సై తాహిర్ హుస్సేన్ కి సూచించారు. ఎస్ఐఆర్ పక్రియలో భాగంగా అర్హత కలిగి ఉన్న ఓటర్ల పేర్లు చేజారకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని తహసీల్దార్ ని జడ్పీటిసి సూచించారు. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ పక్రియ మండల వ్యాప్తంగా దాదాపు 70 శాతం మేర పూర్తి కావోస్తోందని తహసీల్దార్ శివశంకర్ రెడ్డి వెల్లడించారు. ఓటు తొలగింపుపై ఎలాంటి అపోహాలు పడోద్దని, ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు గడువులోగా ఎన్యూమరేషన్ పత్రాలు పూర్తి చేసి బిఎల్ఓ లకు అందజేయాలని కోరారు. లేని పక్షంలో ముసాయిదా జాబితాలో పేరు కోల్పోతారని స్పష్టం చేశారు. ఎంపిడిఓ కుళాయమ్మ, డిప్యూటీ ఎంపిడిఓ రమణయ్య, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## తమ ప్రతిభను ప్రపంచ నలుమూలల వ్యాప్తి చేయాలి

- ఆర్కేవ్యాలి డైరెక్టర్ ఆచార్య జీ.విజయ్ ప్రకాష్
- విధ్యార్థులకు ఆయా ఇంజనీరింగ్ విభాగాలు




**వేంపల్లె మన జనప్రగతి జులై 09:-**విధ్యార్థులు ఆయా ఇంజనీరింగ్ సబ్జెక్టుల్లో ప్రావీణ్యం సంపాదించి, తమ ప్రతిభను ప్రపంచ నలుమూలల వ్యాప్తి చేయాలని ఆర్కేవ్యాలి ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఆచార్య జీ.విజయ్ ప్రకాష్ ఆకాంక్షించారు. గురువారం ఆర్కేవ్యాలి, ఒంగోలు క్యాంపస్ లలో పియూసి పూర్తి చేసిన విధ్యార్థులకు ఆయా ఇంజనీరింగ్ విభాగాలు కేటాయించారు. అనంతరం ఆయన విధ్యార్థులను ఉద్దేశించి పలు సలహాలు సూచనలు చేశారు. ఉన్నతమైన స్థాయికి ఎదగాలంటే కొత్త తరహా నైపుణ్యాలతో రాణించాలని, ప్రస్తుత పోటి ప్రపంచంలో తమ నైపుణ్యాలతో ముందుకెళ్లి ఆదర్శంగా నిలవాలని కోరారు. క్రమశిక్షణ, అంకితభావం, పట్టుదలతో దేన్నైనా సాధించగలమనే ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించు కోవాలన్నారు. తమ తల్లిదండ్రుల కలలకు సాకారంగా జీవిత పయణం కొనాసాగాలని పిలుపునిచ్చారు. దేశాభివృద్ధి, దేశ రక్షణలో తమ పాత్రను పోషించాలని సూచనలు చేశారు. అలాగే పియూసిలో విధ్యార్థులు పొందిన మార్కులు, రిజర్వేషన్, ఆప్షన్ ల ఆధారంగా ఆయా విభాగాలను కేటాయించినట్లు అకాడమీక్ డీన్ రమేష్ కైలాస్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ విభాగాల అధిపతులు, అధికారులు పాల్గొన్నారు.

మనజనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
10 - 07 - 2026

# స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఎన్నికల సంఘం చేపట్టే సాధారణ ప్రక్రియ



**చిట్వేలి మన జనప్రగతి జూలై 09:**-స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) అనేది ఓటర్ల జాబితాను ఖచ్చితంగా, పారదర్శకంగా, తాజాగా ఉంచేందుకు భారత ఎన్నికల సంఘం చేపట్టే సాధారణ ఎన్నికల ప్రక్రియ అని చిట్వేలి మండల తహసీల్దార్ ఎస్.వి. నరసింహారావు తెలిపారు. గురువారం మాల్గోపల్లి స్వర్ణ గ్రామంలో నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు.అర్హత కలిగిన ఏ ఓటరు పేరును కూడా తొలగించరని, ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారమే ఓటర్ల జాబితాలో మార్పులు, సవరణలు చేపడతారని స్పష్టం చేశారు. అర్హత కలిగిన ప్రతి భారత పౌరుడికి ఓటరుగా నమోదు అయ్యే హక్కు ఉందని, అవసరమైన వివరాలు సమర్పించిన ప్రతి అర్హుడికి అవకాశం కల్పిస్తామని తెలిపారు.ఎస్ఐఆర్ కార్యక్రమంపై ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని, ఎన్నికల వ్యవస్థను మరింత పటిష్టంగా, పారదర్శకంగా రూపొందించడమే దీని లక్ష్యమని పేర్కొన్నారు. బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి ఓటరు వివరాలను ధృవీకరిస్తూ అవసరమైన సహాయం అందిస్తున్నారని తెలిపారు.2002 మ్యాపింగ్ పూర్తికాకపోతే ఓటు తొలగిపోతుందనే సామాజిక మాధ్యమాల ప్రచారం పూర్తిగా అవాస్తవమని, అది కేవలం ఓటరు వివరాల ధృవీకరణ ప్రక్రియ మాత్రమేనని, ఎవరి ఓటు హక్కును రద్దు చేసే విధానం కాదని స్పష్టం చేశారు.రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధులు, బూత్ స్థాయి ప్రతినిధులు, ప్రజలందరూ ఎన్నికల అధికారులకు సహకరించి ఎస్ఐఆర్2026 కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అసత్య ప్రచారాలను నమ్మకుండా అధికారిక సమాచారాన్నే విశ్వసించాలని, సందేహాలు ఉంటే బీఎల్వో లేదా తహసీల్దార్ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. ప్రతి అర్హత కలిగిన ఓటు అమూల్యమని, ఖచ్చితమైన ఓటర్ల జాబితా స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికలకు ఎంతో అవసరమని తెలిపారు.

# వృద్ధురాలికి ఆశ్రయం కల్పించిన జనసైనికులు



**దేవనకొండ మన జనప్రగతి జూలై 09:**-దేవనకొండ సంత మార్కెట్‌లో గత 15 సంవత్సరాలుగా ఒంటరిగా నివసిస్తున్న 82 ఏళ్ల అనాధ వృద్ధ మహిళకు జనసేన పార్టీ నాయకులు, స్థానిక ప్రజలు అండగా నిలిచారు. గత రెండేళ్లుగా ఆరోగ్య సమస్యల కారణంగా తన పనులు తాను చేసుకోలేని పరిస్థితిలో ఉన్న ఆమెకు పరిసరాల ప్రజలు ఆహారం అందిస్తూ జీవనాధారం కల్పిస్తున్నారు.ఆమె దయనీయ పరిస్థితిని గమనించిన సంత మార్కెట్ నివాసితులు, జనసేన నాయకులు కలిసి మెరుగైన సంరక్షణ అందించాలనే ఉద్దేశంతో ఆదోనిలోని జీవనజ్యోతి అనాధ వృద్ధాశ్రమం నిర్వాహకులను సంప్రదించారు. అనంతరం వృద్ధ మహిళను ఆశ్రమానికి తరలించి అక్కడ చేర్పించారు.ఈ సందర్భంగా జనసేన పార్టీ వీర మహిళ, ఆలూరు మార్కెట్ యార్డ్ డైరెక్టర్ బి. సరోజ, జనసేన నాయకులు బి. రామాంజినేయులు, మాజీ సైనికులు ఎం. రమేష్, బి. సుధాకర్, పరమేష్, చిన్న రాయుడు, మహేష్, హోటల్ షేక్ సవలి, చింతమాను నాగరాజు, అలాగే సంత మార్కెట్ పరిసరాల నివాసితులు సున్నపు లాలప్ప, బూసల జయమ్మ, బూసల మల్లమ్మ తదితరులు పాల్గొన్నారు. స్థానికులు వారి సేవాభావాన్ని అభినందించారు.

# ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రాణాలను కాపాడుకోండి..!

**వేముల ఎస్ఐ పి.ప్రవీణ్ కుమార్**

**బెస్తవారిపల్లి క్రాస్ వద్ద ప్రత్యేక వాహనాల తనిఖీలు నిర్వహించిన వేముల ఎస్ఐ**

**నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులకు జరిమానాలు..**



**వేముల మన జనప్రగతి జూలై 09:**-వాహనదారులు ట్రాఫిక్ నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటిస్తేనే సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరుకోవచ్చని వేముల ఎస్ఐ పి.ప్రవీణ్ కుమార్ అన్నారు. గురువారం వేముల మండలంలోని బెస్తవారిపల్లి క్రాస్ వద్ద కడపపులివెందుల ప్రధాన రహదారిపై పోలీసు సిబ్బందితో కలిసి ప్రత్యేక వాహనాల తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ...ప్రతి వాహనదారుడు ట్రాఫిక్, రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు.రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రతి ఒక్కరి బాధ్యత ఎంతో కీలకమని పేర్కొన్నారు.ట్రాఫిక్ నియమాల పాటించడం చట్టబద్ధమైన బాధ్యత మాత్రమే కాకుండా కుటుంబ భద్రతకు సంబంధించిన అంశమని చెప్పారు. రోడ్డు భద్రతను ప్రతి ఒక్కరూ తమ జీవనశైలిలో భాగంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు.మద్యం సేవించి వాహనాలు నడపకూడదని,ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా శిరస్త్రాణం ధరించాలని, ముగ్గురు ప్రయాణించడం ప్రమాదకరమని హెచ్చరించారు. అలాగే వాహనాలకు సంబంధించిన చెల్లుబాటు అయ్యే ధృవీకరణ పత్రాలు ఎల్లప్పుడూ వెంట ఉంచుకోవాలని సూచించారు.తనిఖీల సందర్భంగా సరైన ధృవీకరణ పత్రాలు లేని వాహనదారులకు జరిమానాలు విధించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది రియాజ్,కేశవ,రాజేంద్ర,రాజ్‌పాల్ కూడా ఉన్నారు.

# పలు వివాహ కార్యక్రమాల్లో పాల్గొన్న ఆలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి



**దేవనకొండ మన జనప్రగతి జూలై 09:**-దేవనకొండ టర్నింగ్‌లోని ఆర్ఆర్ ఫంక్షన్ హాల్‌లో గురువారం నిర్వహించిన బంటుపల్లి పరమేశ్ గౌడ్ కుమారుడి వివాహ మహోత్సవానికి ఆలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. వారి దాంపత్య జీవితం ఆనందంగా, ఆయురారోగ్యాలతో సాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ బిలేకల్ వెంకటేష్, విజయ భాస్కర్ గౌడ్, సుభాన్, ఆకుల విరేష్, రాజన్న గౌడ్, వెంకటాపురం లక్ష్మన్నతో పాటు పలువురు సీనియర్ నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొని నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు.

# కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాల్సిందే

**● పత్తికొండలో కోర్టు విధులను బహిష్కరించిన న్యాయవాదులు**



**పత్తికొండ మన జనప్రగతి జూలై 09:**-కర్నూలులో హైకోర్టు బెంచ్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని పత్తికొండ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మధుబాబు, సీనియర్ న్యాయవాదులు కారప్ప, గోపాల్‌రెడ్డి, యల్లారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం పత్తికొండ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోర్టు విధులను బహిష్కరించి కోర్టు ఆవరణలో న్యాయవాదులు నిరసన చేపట్టారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బనగానపల్లిలో జరిగే బహిరంగ సభలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని బహిరంగంగా ప్రకటించాలని కోరారు. రాష్ట్రంలో న్యాయవాదులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు ప్రత్యేక న్యాయవాదుల రక్షణ చట్టాన్ని తీసుకురావాలని, జూనియర్ న్యాయవాదులకు నెలకు రూ.10 వేల స్టైఫండ్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటును కోరుతూ జిల్లా వ్యాప్తంగా అన్ని బార్ అసోసియేషన్లు కోర్టు విధులను బహిష్కరించి నిరసనలు చేపడుతున్నాయని తెలిపారు. ఈ ఉద్యమంలో భాగంగా ఈ నెల 10వ తేదీన కూడా పత్తికొండలో కోర్టు విధులను బహిష్కరించి నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తామని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో న్యాయవాదులు మల్లికార్జున, నాగేష్, శ్రీనివాస్‌రెడ్డి, సత్యనారాయణ, హుళ్తెన్న, నాగభూషణం రెడ్డి, పంపాపతి, సూరాజ్, ప్రసాద్, మహేష్, లక్ష్మన్న, శ్రీకాంత్‌రెడ్డి, భాస్కర్, వాసు, అరుణ్, వలి, మధు, రాజాక్, సాంబ,హరి, ప్రవీణ్ పాల్గొన్నారు.

# వేముల పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్ వేణుగోపాల్ రెడ్డికి ఆత్మీయ వీడ్కోలు

**● సేవలను కొనియాడిన ఎస్ఐ,పోలీసు సిబ్బంది**

**● నూతన స్థానంలోనూ ఉత్తమ సేవలు అందించాలని ఆకాంక్ష**



**వేముల మన జనప్రగతి జూలై 09:**-వేముల మండల పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించిన వెన్నపూస వేణుగోపాల్ రెడ్డి ముద్దునూరు పోలీస్ స్టేషన్‌కు బదిలీ కావడంతో గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయనకు ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. పోలీసు అధికారులు, సహచర సిబ్బంది ఆయన సేవలను కొనియాడుతూ ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా వేముల మండల ఎస్ఐ పి.ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ...వేణుగోపాల్ రెడ్డి వేముల పోలీస్ స్టేషన్‌లో క్రమశిక్షణ, అంకితభావంతో విధులు నిర్వహిస్తూ శాఖకు మంచి పేరు తీసుకువచ్చారని కొనియాడారు.ప్రజలతో స్నేహపూర్వకంగా మెలుగుతూ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించి సహచరుల మన్ననలు పొందారని అన్నారు. ముద్దునూరు పోలీస్ స్టేషన్‌లో కూడా అదే సేవా దృక్పథంతో విధులు నిర్వహించి మరింత ఉన్నతంగా రాణించాలని ఆకాంక్షించారు.వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ, వేముల పోలీస్ స్టేషన్‌లో పనిచేసిన కాలం తనకు ఎంతో సంతృప్తినిచ్చిందని,సహచర అధికారులు, సిబ్బంది అందించిన సహకారం ఎప్పటికీ మరువలేనిదని తెలిపారు.నూతన బాధ్యతల్లో కూడా అదే నిబద్ధతతో ప్రజలకు సేవలందిస్తానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ చంద్రశేఖర్ (స్వామి), హెడ్ కానిస్టేబుల్ ఆంజనేయులు,కానిస్టేబుళ్లు రియాజ్,శ్రీనివాసులు,కేశవ,రాజేంద్ర, రాజ్‌పాల్ పాల్గొని వేణుగోపాల్ రెడ్డిని శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

# బోరు మోటార్ చెడిపోవడంతో తాగునీటి కోసం పొలాల బాట పట్టిన మహిళలు

**● చలమారెడ్డిపల్లె బీసీ కాలనీలో ఐదు రోజులుగా నీటి సమస్య**

**● త్వరగా పరిష్కరించాలని అధికారులకు విజ్ఞప్తి**



**సిద్ధవటం మన జనప్రగతి మన జూలై 09:**-మండలంలోని పి.కొత్తపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని చలమారెడ్డిపల్లె బీసీ కాలనీలో తాగునీటి బోరు మోటార్ చెడిపోవడంతో ఐదు రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోయిందని స్థానిక మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీరు అందక సమీపంలోని పంట పొలాలకు వెళ్లి నీరు తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొందని తెలిపారు. గురువారం కాలనీవాసులు మాట్లాడుతూ..బోరు మోటార్ మరమ్మతులు చేపట్టడంలో జాప్యం కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, చిన్నారులు, వృద్ధులు కూడా తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. వెంటనే మరమ్మతులు పూర్తి చేసి తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని సంబంధిత అధికారులను కోరారు. ఈ విషయమై పి. కొత్తపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి లలితను వివరణ కోరగా, తాగునీటి మోటార్ దెబ్బతిన్న విషయం వాస్తవమేనని, అవసరమైన మరమ్మతులు చేపట్టి రెండు రోజుల్లో సమస్యను పూర్తిగా పరిష్కరిస్తామని తెలిపారు.

# పంటల బీమా రైతులకు ధీమా..!

**- మండల వ్యవసాయ అధికారి రమేష్**

**లింగాల మన జనప్రగతి జూలై 09:**-ప్రస్తుత ఖరీఫ్2026 సీజన్‌లో సాగు చేస్తున్న రైతులు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (పీ.ఎం.ఎఫ్బి.వై), వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం (ఆర్డబ్ల్యూబిసిఐఎస్)ను సద్వినియోగం చేసుకోవాలని గురువారం మండల వ్యవసాయ అధికారి రమేష్ కోరారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో వాతావరణ పంటల భీమా క్రింద వేరుసెనగ,పత్తి, చీనీ పంటలకు రైతులు జూలై 15లోపు నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద వరి పంట నమోదుకు ఆగస్టు 15 వరకు,కంది,జొన్న,మినుము,ఉల్లి,పసుపు తదితర పంటలకు జూలై 31 వరకు నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు.పంటల బీమా నమోదు వివరాలను క్షేత్రస్థాయిలో ఈ-పంట నమోదుతో ధ్రువీకరిస్తారని ఆయన తెలిపారు. బీమా నమోదు కోసం ప్రతి రైతుకు ఫార్మర్ ఐడీ (రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య) తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు. ఫార్మర్ ఐడీ లేని రైతులు ఆందోళన చెందకుండా తమ పరిధిలోని రైతు సేవా కేంద్రం లో వెంటనే నమోదు చేసుకోవాలని సూచించారు.ఆధార్, ఆధార్‌తో అనుసంధానమైన బ్యాంకు ఖాతా, పట్టాదారు పాస్‌బుక్, పంట ధృవీకరణ పత్రం వివరాలతో సమీపంలోని సీఎస్‌సీ కేంద్రాల్లో బీమా నమోదు చేసుకోవాలని,గడువు ముగిసేలోపు రైతులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏవో రమేష్ తెలిపారు.

# వసతి గృహాల్లో డైట్ చార్జీల పెంపు..

**- ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ హర్షం**



**చిత్తూరు మన జనప్రగతి జూలై09:**-రాష్ట్రంలోని సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థులకు నూతన విద్యా సంవత్సరంలో 10 శాతం డైట్ చార్జీలు పెంచుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నిర్ణయం తీసుకోవడం పట్ల చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ హర్షం వ్యక్తం చేశారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా విద్యార్థుల సంక్షేమం దృష్ట్యా కూటమి ప్రభుత్వం విద్యార్థులకు అందించే ఆహార చార్జీలను 10 శాతం పెంచడంపై సంతోషం వ్యక్తం చేశారు. గత వైకాపా పాలనలో హాస్టళ్లు, గురుకులాలు సమస్యలకు నిలయంగా మారి విద్యార్థులు ఇబ్బందులు పడే వారిని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకా పరిస్థితి చక్కదిద్దినట్లు చెప్పారు. గురుకులాలు, హాస్టల్లో ఉండి చదువుకునే పేద విద్యార్థులకు ఈ నిర్ణయం ఎంతో మేలు చేస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో జిల్లాలోని ఎనిమిది వేల మందికి పైగా విద్యార్థులకు ప్రయోజనం కలుగుతుందన్నారు. పెరుగుతున్న ధరల ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో..ఆర్థిక ఇబ్బందులు ఉన్నా డైట్ చార్జీలు పెంచుతూ నిర్ణయం తీసుకోవడంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి కృతజ్ఞతలు తెలిపారు.

# శ్రీ శీతల గంగమ్మ జాతరకు కూటమి నాయకులకు ఆహ్వాన పత్రిక అందజేత

**- 29, 30 తేదీల్లో పార్వతీపురంలో 23వ జాతర మహోత్సవాలు**



**సిద్ధవటం మన జనప్రగతి జూలై 09:**-మండలంలోని మాధవరం-1 గ్రామ పంచాయతీ పరిధిలోని పార్వతీపురం గ్రామంలో వెలసిన శ్రీ శీతల గంగమ్మ అమ్మవారి 23వ జాతర మహోత్సవాలు ఈనెల 29, 30 తేదీల్లో బుధ, గురువారాలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా రాజంపేట జనసేన పార్టీ పార్లమెంట్ సమన్వయకర్త అతికారి కృష్ణ, టీడీపీ రాజంపేట అసెంబ్లీ ఇన్‌చార్జి చమర్తి జగన్ మోహన్ రాజుకు జాతర ఆహ్వాన పత్రికను అందజేసి శాలువాలతో సత్కరించారు. జాతర మహోత్సవాలకు విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని తల్లి ఆశీస్సులు పొందాలని ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. ఆహ్వాన పత్రికను స్వీకరించిన నాయకులు శ్రీ శీతల గంగమ్మ అమ్మవారు శక్తివంతమైన దైవమని, మాధవరం పరిసర గ్రామాల ప్రజలను కాపాడే గ్రామదేవతగా భక్తుల విశ్వాసం ఉందని పేర్కొంటూ, జాతరలో తప్పకుండా పాల్గొంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిట్టా వెంకటేశు, సాయి, నరేష్, బాలక్రిష్ణ, సుబ్బరాయుడు, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

# జరికోనలో అక్రమ మైనింగ్‌పై సమగ్ర విచారణ జరపాలి

- మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి
- ఏడాదికిపైగా అక్రమ మైనింగ్ జరుగుతోందని ఆరోపణ
- ప్రభుత్వ భూముల పరిరక్షణలో నిర్లక్ష్యంపై ప్రభుత్వాన్ని ప్రశ్నించిన మాజీ ఎమ్మెల్యే




**అన్నమయ్య జిల్లా ప్రతినిధి మన జనప్రగతి జులై 09:**–సంబేపల్లె మండలం శెట్టిపల్లె గ్రామ పరిధిలోని జరికోన సమీపంలో ఏడాదికిపైగా భారీ ఎత్తున అక్రమ మైనింగ్ జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడం లేదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి ఆరోపించారు. వందలాది టిప్పర్ల ద్వారా భారీ రాళ్లను అక్రమంగా తరలిస్తూ ప్రజా సంపదను దోచుకుంటున్నారని విమర్శించారు.మైనింగ్ ప్రాంతంలో అక్రమాలను ప్రశ్నించేందుకు వెళ్లిన వారిపై దాడులు జరుగుతున్నాయని, అధికారులు అనుమతులు ఇవ్వలేదని చెబుతూనే ఏడాదిగా జరుగుతున్న మైనింగ్‌ను ఎందుకు అడ్డుకోలేకపోయారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పర్యావరణ అనుమతులు లేకుండానే తవ్వకాలు కొనసాగుతున్నాయని ఆరోపిస్తూ, మైనింగ్, టిప్పర్ల అక్రమ రవాణాపై అధికారులు ప్రజలకు వివరణ ఇవ్వాలని కోరారు.**ప్రభుత్వ భూములను కాపాడాల్సిన బాధ్యత అందరిదే..**జిల్లా ఏర్పడిన సమయంలో ప్రభుత్వ భూములను గుర్తించి బోర్డులు ఏర్పాటు చేయించిన చరిత్ర తనదేనని శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. ప్రస్తుతం విలువైన ప్రభుత్వ భూములపై బోర్డులు తొలగించి ప్లాట్లు వేస్తున్నారని ఆరోపిస్తూ, అలాంటి భూముల కొనుగోలు, అమ్మకాలకు ప్రజలు దూరంగా ఉండాలని సూచించారు.తమ ప్రభుత్వ హయాంలో 20 వేల పక్కా గృహాలు, వంద పడకల ఆసుపత్రి, క్రీడా మైదానం, శిల్పారామం, సాగునీటి ప్రాజెక్టులు, వాటర్ గ్రిడ్ వంటి అనేక అభివృద్ధి పనులు చేపట్టామని పేర్కొన్నారు. ప్రజా సంపదను కాపాడడం ప్రతి ప్రభుత్వ బాధ్యత అని, తప్పు చేసిన వారు ఎవరైనా చట్టపరమైన చర్యల నుంచి తప్పించుకోలేరని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మైనారిటీ జిల్లా అధ్యక్షుడు బేపారి మహమ్మద్ ఖాన్, పట్టణ కన్వీనర్ నవాజ్, జుల్ ఫకీర్ తదితరులు పాల్గొన్నారు.

# రాయలసీమ హక్కుల పరిరక్షణ ధర్నాకు యూఎస్ఎఫ్ఐ సంఘీభావం



**అనంతపురం మన జనప్రగతి జులై 09:**–రాయలసీమ హక్కుల పరిరక్షణ కోసం అనంతపురం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట రాయలసీమ విద్యావంతుల వేదిక, అనంత హక్కుల పోరాట సంఘం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ధర్నా కార్యక్రమానికి యునైటెడ్ స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (యూఎస్ఎఫ్ఐ) అనంతపురం జిల్లా కమిటీ సంఘీభావం ప్రకటించింది.రాయలసీమ ప్రాంత అభివృద్ధి, హక్కుల పరిరక్షణ, ప్రాంతీయ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని ధర్నాలో పాల్గొన్న నాయకులు డిమాండ్ చేశారు. రాయలసీమకు తగిన ప్రాధాన్యం కల్పించి, పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని కోరారు. యూఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి భీమేష్, నాయకుడు సుంక నాయక్‌తో పాటు జిల్లా కమిటీ సభ్యులు, రాయలసీమ విద్యావంతుల వేదిక, అనంత హక్కుల పోరాట సంఘం ప్రతినిధులు పాల్గొని ధర్నాకు మద్దతు తెలిపారు.

# రాగులపాడు గురుకులంలో భద్రతా లోపాలపై విమర్శలు

- పాము ఘటనలపై ఏఐఎఫ్‌డీఎస్ ఆందోళన
- ప్రభుత్వం వెంటనే స్పందించాలని విజ్ఞప్తి



**అనంతపురం మన జనప్రగతి జులై 09:**–ఉరవకొండ నియోజకవర్గంలోని రాగులపాడు ఎస్టీ గురుకుల పాఠశాలలో వరుసగా పాములు కనిపిస్తున్న ఘటనలు విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఇటీవల 9వ తరగతి విద్యార్థి తులసి నాయక్ పాము కాటుకు గురై చికిత్స పొందుతున్న ఘటన అనంతరం, మరోసారి పాఠశాల ఆవరణలో నాగుపాము కనిపించడం కలకలం రేపింది.ఈ ఘటనపై ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సీఎం సిద్ధూ స్పందిస్తూ, విద్యార్థుల భద్రత విషయంలో నిర్లక్ష్యం తగదన్నారు. పాఠశాల ఆవరణలోని పొదలు, కలుపు మొక్కలను తొలగించి, పాములు సంచరించకుండా శాశ్వత నివారణ చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.అలాగే ఘటనపై సమగ్ర విచారణ జరిపి నిర్లక్ష్యం చేసిన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని అన్ని గురుకుల పాఠశాలల్లో భద్రతా ప్రమాణాలను సమీక్షించి, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.విద్యార్థుల ప్రాణ భద్రతకు పూర్తి హామీ ఇవ్వాలని, అధికారులు వెంటనే స్పందించకపోతే ప్రజాస్వామ్యబద్ధంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని సీఎం సిద్ధూ హెచ్చరించారు.

# విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడొద్దు:ఏఐఎస్ఎఫ్ హెచ్చరిక


**- రాగులపాడు గురుకుల పాఠశాలలో భద్రతా చర్యలు చేపట్టాలని డిమాండ్**



**వజ్రకరూరు మన జనప్రగతి జులై 09:**–నియోజకవర్గంలోని వజ్రకరూరు మండలం రాగులపాడు ఎస్టీ గురుకుల పాఠశాలలో వరుసగా పాములు కనిపించడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి తగ్గపర్తి చందు పేర్కొన్నారు. ఇటీవల 9వ తరగతి విద్యార్థి తులసి నాయక్ పాము కాటుకు గురై చికిత్స పొందుతుండగానే, తాజాగా మరోసారి నాగుపాము ప్రత్యక్షమవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు.పాఠశాల ఆవరణలో పెరిగిన పొదలు, కలుపు మొక్కలను వెంటనే తొలగించి పాముల సంచారాన్ని అరికట్టేందుకు శాశ్వత చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఘటనపై సమగ్ర విచారణ నిర్వహించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.రాష్ట్రంలోని అన్ని గురుకుల పాఠశాలల్లో భద్రతా ప్రమాణాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, విద్యార్థుల ప్రాణాలకు ఎలాంటి ప్రమాదం లేకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థుల భద్రత విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం కొనసాగిస్తే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

# రాగులపాడు ఎస్టీ గురుకులంలో మళ్లీ నాగుపాము కలకలం

- విద్యార్థుల భద్రతపై తల్లిదండ్రుల ఆందోళన
- భద్రతా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి




**ఉరవకొండ మన జనప్రగతి జులై 09:**–ఉరవకొండ నియోజకవర్గ పరిధిలోని రాగులపాడు ఎస్టీ గురుకుల పాఠశాలలో మరోసారి నాగుపాము ప్రత్యక్షమవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఇటీవలే 9వ తరగతి విద్యార్థి తులసి నాయక్ పాము కాటుకు గురై చికిత్స పొందుతున్న ఘటన మరువకముందే ఈ సంఘటన చోటుచేసుకోవడం ఆందోళన కలిగిస్తోంది.గురువారం ఉదయం పాఠశాల ఆవరణలో నాగుపాము కనిపించడంతో సిబ్బంది వెంటనే అప్రమత్తమై రాగులపాడు గ్రామానికి చెందిన స్నేక్ క్యాచర్లకు సమాచారం అందించారు. వారు ఘటనాస్థలికి చేరుకుని నాగుపామును సురక్షితంగా పట్టుకుని సమీప అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు. దీంతో విద్యార్థులు, సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.అయితే గురుకులంలో వరుసగా పాములు కనిపిస్తుండటంతో విద్యార్థుల భద్రతపై తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల ఆవరణలో పెరిగిపోయిన పొదలు, కలుపు మొక్కలు, అపరిశుభ్ర వాతావరణం కారణంగానే ఇలాంటి ఘటనలు పునరావృతమవుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.విద్యార్థుల ప్రాణ భద్రతను దృష్టిలో ఉంచుకుని గురుకులం ఆవరణను పూర్తిగా శుభ్రపరచడంతో పాటు పొదలను తొలగించి, పాములు, విషపురుగులు సంచరించకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని తల్లిదండ్రులు, స్థానికులు అధికారులను కోరుతున్నారు. ఇటీవల జరిగిన పాము కాటు ఘటనతో పాటు తాజాగా నాగుపాము ప్రత్యక్షమైన నేపథ్యంలో అధికారులు తక్షణమే స్పందించి గురుకులంలో భద్రతా ప్రమాణాలను మరింత కట్టుదిట్టం చేయాలని సుబ్రహ్మణ్యం నాయక్‌తో పాటు పలువురు స్థానికులు డిమాండ్ చేశారు.

# ఆదర్శ గ్రామాల లక్ష్యానికి పనులు వేగవంతం చేయాలి

- నిధుల వినియోగంలో జాప్యానికి తావివ్వొద్దు: జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్
- నాలుగు వందల నాలుగు అభివృద్ధి పనుల్లో రెండు వందల ఇరవై ఐదు పూర్తి.
- మిగిలినవి గడువులోగా పూర్తి చేయాలని ఆదేశం



**చిత్తూరు మన జనప్రగతి జులై 09:**–షెడ్యూల్డ్ కులాల జనాభా అధికంగా ఉన్న గ్రామాల సమగ్రాభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన పనులను వేగవంతం చేసి, మంజూరైన నిధులను పూర్తిస్థాయిలో వినియోగించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అధికారులను ఆదేశించారు.గురువారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రెండు వేల ఇరవై ఆరుఇరవై ఏడు ఆర్థిక సంవత్సరానికి జిల్లాకు మొత్తం పది కోట్ల తొంభై ఆరు లక్షల ముప్పై రెండు వేల రూపాయలు మంజూరయ్యాయని తెలిపారు. ఇందులో పంచాయతీరాజ్ శాఖ ద్వారా నూట పదిహేడు పనులు, గ్రామీణ నీటి సరఫరా శాఖ ద్వారా రెండు వందల ఎనభై ఏడు పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు.జిల్లాలో మొత్తం నాలుగు వందల నాలుగు అభివృద్ధి పనులు చేపట్టగా, వాటిలో రెండు వందల ఇరవై ఐదు పూర్తయ్యాయని, నూట నలభై ఏడు పనులు పురోగతిలో ఉండగా, ముప్పై రెండు పనులు ఇంకా ప్రారంభం కాలేదన్నారు. పెండింగ్ పనులను గడువులోగా పూర్తి చేసి, బిల్లులను వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేసి నిధుల విడుదలలో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.తాగునీరు, రహదారులు, పారిశుధ్యం, విద్యుత్, విద్య, ఆరోగ్యం, అంగన్‌వాడీలు, జీవనోపాధి వంటి రంగాల్లో గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దడమే పథకం లక్ష్యమని పేర్కొన్నారు. పనుల నాణ్యతలో రాజీ పడకుండా ప్రతి రూపాయి పారదర్శకంగా వినియోగించేలా చూడాలని సూచించారు.సమావేశంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి రవి ప్రకాష్ నాయుడు, గ్రామీణ నీటి సరఫరా శాఖ పర్యవేక్షణ ఇంజనీర్ విజయ్ కుమార్, పంచాయతీరాజ్ పర్యవేక్షణ ఇంజనీర్ చంద్రశేఖర్, సంబంధిత శాఖల అధికారులు, సహాయ ఇంజనీర్లు, మండల అభివృద్ధి అధికారులు పాల్గొన్నారు

# ముళ్ల పొదల్లో గ్రామ సూచిక బోర్డు..

**- ప్రయాణికులకు ఇబ్బందులు**



**సిద్ధవటం మన జనప్రగతి జూలై 09:**–మండలంలోని సంటిగారిపల్లె గ్రామ సూచిక బోర్డు ముళ్ల పొదల్లో పూర్తిగా కప్పుకుపోవడంతో గ్రామాన్ని గుర్తించడం ప్రయాణికులు, వాహనదారులకు ఇబ్బందికరంగా మారింది. ఆర్ అండ్ బి శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా సూచిక బోర్డు కనిపించకుండా పోయిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే ముళ్ల పొదలను తొలగించి సూచిక బోర్డు స్పష్టంగా కనిపించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు అధికారులను కోరుతున్నారు.

# ఆధునిక సౌకర్యాలతో చిత్తూరు రైల్వే స్టేషన్



**చిత్తూరు మన జనప్రగతి జూలై 09:**–దక్షిణ కోస్తా రైల్వే గుంటూరు డివిజన్ డిఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా గురువారం చిత్తూరు రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులను పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ...అమృత్ పథకం కింద చిత్తూరు రైల్వే స్టేషన్ ఎంపికై మౌలిక సదుపాయాలతో పాటు లిఫ్ట్ సౌకర్యం, ఆధునిక విశ్రాంతి గదులు, ద్విచక్ర వాహనం మరియు కార్ పార్కింగ్ సైతం ప్రత్యేకంగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు ప్రయాణికులకు సులభంగా రైల్వే స్టేషన్ వరకు నూతన రోడ్లు నిర్మించామని తెలిపారు, ఈ రైల్వే స్టేషన్ ని అన్ని హంగులతో త్వరలో ప్రారంభిస్తున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో రైల్వే పోలీసులు సాధారణ పోలీసులు, రైల్వే డిపార్ట్మెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

# మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో..27 మంది హైరిస్క్ గర్భిణులకు వైద్య పరీక్షలు




**బొమ్మనహాల్ మన జనప్రగతి జూలై 09:**–స్థానిక మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వైద్యాధికారులు డాక్టర్.చల్లా శ్రీలక్ష్మి,డాక్టర్.బొడ వినీత ఆధ్వర్యంలో బొమ్మనహాల్, కురువళ్లి,నేమకల్లు,గ్రామాలకు చెందిన 27 మంది హైరిస్క్ గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు,ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ.గర్భిణులకు పౌష్టికాహారం ప్రాధాన్యతపై అవగాహన కల్పిస్తూ అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పోషకాహారం తీసుకోవాలని,అందులో ముఖ్యంగా చేనక్కాయలు, బెల్లం, గోంగూర,మునగాకు,రాగులు, చిక్కుడుకాయలు వంటి ఐరన్ అధికంగా ఉండే ఆహార పదార్థాలను క్రమం తప్పకుండా తీసుకోవాలని సూచించారు, ప్రసవం కోసం బొమ్మనహాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని వినియోగించుకోవాలని, అత్యవసర పరిస్థితుల్లో 108,104 సేవలను ఉపయోగించుకోవాలని తెలిపారు. ఆయా గ్రామాల ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు,ఆశ కార్యకర్తలు, హెల్త్ సూపర్వైజర్ రుక్మిణి, గర్భవతులు,పాల్గొన్నారు.

# నిఖా వివాహంలో వధూవరులను ఆశీర్వదించిన ముక్కా వరలక్ష్మి మరియు కూటమి నాయకులు

**ఓబులవారిపల్లి మన జనప్రగతి జూలై 09:**–ఓబులవారిపల్లి మండలం ముక్కు వారి పల్లి గ్రామానికి చెందిన మహమ్మద్ గౌస్ కుమారుడు షేక్ మహమ్మద్ వధువు నూర్–ఏ–ఆ ఈస్ నికా వివా హమ్ జీవిపురం పల్లా వెంకటసుబ్బయ్య కళ్యాణ మండపంలో జరిగిన వివాహానికి కూడా చైర్మన్ టిడిపి ఇంచార్జ్ ఒక్కరూపానంద రెడ్డి సతీమణి మొక్క వరలక్ష్మి మరియు కోటమి నాయకులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు ఈ కార్యక్రమంలో సిగమాల మల్లికార్జున్రెడ్డి బత్తిని వేణుగోపాల్ రెడ్డి మరియు ముక్క వారి పల్లి నాయకులు ఆలీ సాహెబ్ జమీర్ అక్బర్ ఇస్మాయిల్ మౌలా సాహెబ్ మౌలానా తదితర కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు

మనజనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
10 - 07 - 2026

# ఎస్ఐఆర్ ఓటరు నమోదు గడువు పొడిగించాలి

**● యునైటెడ్ జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ సి.జాఫర్**




**ఉరవకొండ మన జనప్రగతి జులై 09:–**స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ఓటరు నమోదు ప్రక్రియ గడువును ప్రభుత్వం వెంటనే పొడిగించాలని యునైటెడ్ జాయింట్ యాక్షన్ కమిటీ (యూజేఏసీ) కన్వీనర్ సి. జాఫర్ కోరారు. గురువారం ఉరవకొండలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటరు నమోదు అవకాశం కల్పించేలా గడువు పెంచాలని విజ్ఞప్తి చేశారు. 2002 ఓటరు జాబితాలో పేరు లేకపోయినా, ఆధార్ కార్డు తదితర చెల్లుబాటు అయ్యే పత్రాలతో ఎన్యుమరేషన్ ఫారాలను జతచేసి ఓటరు నమోదుకు అవకాశం కల్పిస్తూ జిల్లా కలెక్టర్ ఆనంద్ ఇచ్చిన మార్గదర్శకాలను ఆయన స్వాగతించారు. అయితే జిల్లా వ్యాప్తంగా గణనీయ సంఖ్యలో ఓటర్లు జాబితా నుంచి తప్పిపోయే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా యంత్రాంగం, బీఎల్‌వోలు, ప్రభుత్వ ఉద్యోగులు ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతంగా నిర్వహిస్తున్నప్పటికీ, నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తిగా చేరుకోవడం కష్టంగా మారిందన్నారు. అందువల్ల అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునేలా ఎస్ఐఆర్ గడువును ప్రభుత్వం వెంటనే పొడిగించాలని సి. జాఫర్ డిమాండ్ చేశారు.

# హీరోజీ రావుకు బీజేపీ జిల్లా ఉపాధ్యక్ష పదవి..కార్యకర్తల హర్షం



**బొమ్మనహల్ మన జనప్రగతి జూలై 09:–**బొమ్మనహల్ మండలంలోని ఒక మారుమూల ప్రాంతమైన ఉంతకల్లు గ్రామ నివాసి హీరోజీ రావు, గత 26 సంవత్సరాలుగా భారతీయ జనతా పార్టీలో పార్టీ బలోపేతం కోసం నిర్విరామంగా శ్రమిస్తూ, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ, ప్రతిపక్షాల వైఫల్యాలను ప్రజలకు తెలియజేస్తూ అలుపెరగని యోధుడిగా ప్రజలకు సేవలందిస్తున్న "హీరోజీ రావును అనంతపురం జిల్లా బీజేపీ జిల్లా ఉపాధ్యక్షునిగా నియమించారు", ఆయన చేసిన నిరాడంబర సేవలను పార్టీ అధిష్ఠానం గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించడంపై జిల్లా భారతీయ జనతా పార్టీ (బీజేపీ)నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఆయన నాయకత్వంలో జిల్లాలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తూ, పలువురు అభిమాన కార్యకర్తలు కలిసి నూతన జిల్లా ఉపాధ్యక్షుని పదవి భాధ్యతలు అందుకున్న హీరోజీ రావుకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.

# జిల్లా బీజేవైఎం ఉపాధ్యక్షుడు ప్రశాంత్ రెడ్డికి ఘన సన్మానం

**ఓబులవారిపల్లి మన జనప్రగతి జూలై 09:–**తిరుపతి జిల్లా బీజేవైఎం ఉపాధ్యక్షుడు ప్రశాంత్ రెడ్డికి ఓబులవారిపల్లి మండలం వడ్డేపల్లి గ్రామంలో ఘన సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల బీజేపీ అధ్యక్షుడు మొక్క రూపేష్ రెడ్డి, జంగల్ రాయుడు శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, భారతీయ జనతా పార్టీని మరింత బలోపేతం చేయడానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, బీజేవైఎం కార్యకర్తలు, పార్టీ అభిమానులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



# రాష్ట్రాన్ని నిర్వీర్యం చేసిన రెండేళ్ల పాలన: మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి



**రాయచోటి మన జనప్రగతి జులై 09:–**కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకబడిందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి విమర్శించారు. గురువారం రాయచోటిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం పరిపాలనలో పూర్తిగా విఫలమై ప్రజల సమస్యలను విస్మరించిందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను అధికార పార్టీ ప్రజాప్రతినిధులే బహిరంగంగా ప్రస్తావిస్తున్నారని, ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీసే విధంగా ప్రశ్నించే వారిపై కేసులు నమోదు చేసి వేధింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. మీడియా, సామాజిక మాధ్యమాల స్వేచ్ఛను కూడా హరిస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో విద్య, వైద్యం, వ్యవసాయం, ఉపాధి రంగాలు తీవ్ర సంక్షోభంలో ఉన్నాయని, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రైతులకు ఎరువులు, విత్తనాలు సకాలంలో అందడం లేదని, మహిళలకు ఇచ్చిన హామీలు అమలు కాలేదని విమర్శించారు. ఆరోగ్యశ్రీ బకాయిలు పెండింగ్‌లో ఉండటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు దెబ్బతిన్నాయని, పలు ఘటనల్లో బాధితులకు న్యాయం జరగడం లేదన్నారు. ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటీకరణ దిశగా తీసుకెళ్తున్నారని, అక్రమ మైనింగ్, ఇసుక రవాణాపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. జిల్లాల పునర్విభజన విషయంలో అయోమయం నెలకొందని, కార్యాలయాల తరలింపుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు. రాజకీయ ప్రయోజనాల కోసం మాటలు మార్చడం సరికాదని, ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ సమావేశంలో మాజీ మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ భాష, వైఎస్సార్‌సీపీ మైనార్టీ జిల్లా అధ్యక్షుడు బేపార్ మహమ్మద్ ఖాన్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# చెన్నూరు గ్రీన్ కో పవర్ ప్లాంట్‌కు మంచి రోజులు

**● ఏండ్ల కిందట మూతబడిన పవర్ ప్లాంట్ కు తిరిగి మోక్షం**

**● పవర్ ప్లాంట్ రన్నింగ్ సమయంలో భారీ శబ్దాలు,ఉలిక్కిపడ్డ ప్రజలు**



**చెన్నూరు మన జనప్రగతి జులై 09:–**మండల కేంద్రమైన చెన్నూరు పెన్నా నది ఒడ్డున ఏర్పాటుచేసిన గ్రీన్ కో పవర్ ప్లాంట్ తిరిగి ప్రారంభించేందుకు గురువారం ట్రైల్ రన్ చేయడంతో పవర్ ప్లాంట్ చుట్టుపక్కల ఉన్న ప్రజలు ఆ శబ్దాలకు భయభ్రాంతులైనారు. పవర్ ప్లాంట్ లో ముడి పదార్థాలు వేసే బైలర్ టల్ పరీక్షించారు. చెన్నూర్ లో 20 ఏళ్ల కిందట హైదరాబాద్ కు చెందిన బాలాజీ బయోమాస్ కంపెనీవారు పవర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. ఆ తర్వాత వారు గ్రీన్ కో పవర్ సంస్థ కొనుగోలు చేశారు. గ్రీన్కో సంస్థ యాజమాన్యం చెన్నూరు పవర్ ప్లాంట్ ను కొనుగోలు చేయడంతో కలిసి రావడం వలన గ్రీన్కో సంస్థ అంచలంచెలుగా సోలార్ పవన్ విద్యుత్ సంస్థలు ఏర్పాటు చేశారు. చెన్నూరు లో ఉన్న గ్రీన్ కో పవర్ ప్లాంట్ గత ఐదేళ్లుగా ఉత్పత్తి నిలుపుదల చేశారు. అయితే పవర్ ప్లాంట్ గ్రీన్కోవారికి కలిసి రావడంతో పవర్ ప్లాంట్ నడపకపోయినా అక్కడ పని చేయించుకుంటూ ఉన్న కార్మికులకు జీతాలు చెల్లిస్తూ ఉన్నారు. ఇటీవల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పారిశుద్ధ్యంలో భాగంగా చెత్తాచెదారాలు వాటి వినియోగం కోసం తద్వారా విద్యుత్ ని ఉత్పత్తి చేయవచ్చన్న ఆలోచనలో అధికారులు నిర్ణయించుకున్నారు. ఈ మేరకు చెన్నూరు పవర్ ప్లాంట్ ద్వారా విద్యుత్ను ఉత్పత్తి చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది. ప్రస్తుతం రాష్ట్రంలో ఈ సంవత్సరం వర్షాలు తక్కువ కావడం ఎలాగైనా పవర్ ప్లాంట్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసేందుకే సన్నాహాలు మొదలయ్యాయి. ఏదేమనప్పటికీ కార్మికులు యాజమాన్యం పవర్ ప్లాంట్ ను తిరిగి రన్నింగ్ పవర్ ప్లాంట్ ద్వారా విద్యుత్ సమస్య నెరవేరుతుంది. కానీ పవర్ ప్లాంట్ ట్రైల్ రన్నింగ్ చేయడంతో పవర్ ప్లాంట్ పరిసర ప్రాంతాల ప్రజలు ఆ శబ్దాలకు తీవ్ర ఆందోళన చెందారు. ఏదేమనప్పటికీ గ్రీన్ కో పవర్ ప్లాంట్ యాజమాన్యం శబ్దాలు నివారణకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. పవర్ ప్లాంట్ ద్వారా విద్యుత్ సమస్య నెరవేరుతుంది. కానీ పవర్ ప్లాంట్ ట్రైల్ రన్నింగ్ చేయడంతో పవర్ ప్లాంట్ పరిసర ప్రాంతాల ప్రజలు ఆ శబ్దాలకు తీవ్ర ఆందోళన చెందారు. ఏదేమనప్పటికీ గ్రీన్ కో పవర్ ప్లాంట్ యాజమాన్యం శబ్దాలు నివారణకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. తెచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇదే జరిగితే కొంతవరకు పవర్ ప్లాంట్ ద్వారా విద్యుత్ సమస్య నెరవేరుతుంది కానీ పవర్ ప్లాంట్ ట్ర ల్ రన్నింగ్ చేయడంతో పవర్ ప్లాంట్ పరిసర ప్రాంతాల ప్రజలు ఆ శబ్దాలకు తీవ్ర ఆందోళన చెందారు ఈ శబ్దాలు రాకుండా గ్రీన్ కో పవర్ ప్లాంట్ యాజమాన్యం చర్యలు తీసుకోవాల్సి ఉంది,

# కాకినాడ రూరల్ మండల తహశీల్దార్‌గా పోతురాజు బాధ్యతల స్వీకరణ



**కాకినాడ రూరల్ మన జనప్రగతి జూలై 09:–**పశ్చిమ గోదావరి జిల్లాలో డిప్యూటీ తహశీల్దార్‌గా విధులు నిర్వహించిన సంబలదీవి పోతురాజు పదోన్నతి పొంది కాకినాడ రూరల్ తహశీల్దార్‌గా బదిలీ అయ్యారు. ఇటీవల ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఆయన కాకినాడ రూరల్ మండల కార్యాలయంలో తహశీల్దార్‌గా గురువారం బాధ్యతలు తీసుకున్నారు. పరిపాలనా అనుభవం కలిగిన పోతురాజు రెవెన్యూ శాఖలో వివిధ హోదాల్లో సేవలు అందించారు. ప్రజలకు వేగవంతమైన, పారదర్శక సేవలు అందించడంలో ఆయనకు మంచి అనుభవం ఉందని సహచర అధికారులు పేర్కొంటున్నారు. భూ సమస్యలు, ఆదాయ, కుల,నివాస ధృవపత్రాలు, రెవెన్యూ సంబంధిత ఇతర సేవల పరిష్కారంలో ప్రజలకు మరింత సౌకర్యవంతమైన సేవలు అందే అవకాశముందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కాకినాడ రూరల్ మండలంలో రెవెన్యూ పరిపాలనను మరింత సమర్థవంతంగా నిర్వహిస్తూ, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, భూ వివాదాల పరిష్కారం, ప్రజా సమస్యల పరిష్కారంలో పోతురాజు ప్రత్యేక దృష్టి సారించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. మండల ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానని పోతురాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు మర్యాద పూర్వకంగా కలిశారు

# గుర్రంకొండ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్,ఎస్పీ

**● మహిళలు, చిన్నారుల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాలి: కలెక్టర్ నిశాంత్ కుమార్ ● పెండింగ్ కేసులపై సమీక్ష..ఫిర్యాదుల సత్వర పరిష్కారానికి ఆదేశం**



**అన్నమయ్య జిల్లా ప్రతినిధి మన జనప్రగతి జూలై 09:–**అన్నమయ్య జిల్లా గుర్రంకొండ పోలీస్ స్టేషన్‌ను జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మహిళలు, చిన్నారుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, వారి ఫిర్యాదులను బాధ్యతాయుతంగా స్వీకరించి సకాలంలో పరిష్కరించాలని పోలీసు అధికారులకు సూచించారు. పోలీస్ స్టేషన్‌లోని రికార్డులు, పెండింగ్ కేసులు, మహిళలు, చిన్నారులకు సంబంధించిన ఫిర్యాదుల నమోదు, విచారణ పురోగతిని సమీక్షించారు. ఐవీఆర్ఎస్ ద్వారా వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించి, అవసరమైతే బాధితుల వద్దకు వెళ్లి సమస్యలను తెలుసుకుని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో బాల్య వివాహాలు, పోక్సో కేసుల నివారణకు ప్రత్యేక దృష్టి సారించి, మహిళా పోలీసులు గ్రామాలు, పాఠశాలలు, కళాశాలల్లో భద్రత, చట్టాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అలాగే పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించి, ప్రతి కేసు విచారణను పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో మాట్లాడి, వారి సమస్యలపై పోలీసులు స్పందిస్తున్న తీరును కలెక్టర్ స్వయంగా తెలుసుకున్నారు. ప్రజలతో మర్యాదగా వ్యవహరించి, మహిళలు, చిన్నారులకు సంబంధించిన కేసుల్లో సున్నితంగా స్పందించాలని పోలీసు సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ కృష్ణమోహన్, వాయల్పాడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాఘవరెడ్డి, గుర్రంకొండ ఎస్ఐ రవీంద్రబాబు, మహిళా పోలీసులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# రాయచోటి రోటరీ క్లబ్ నూతన కార్యవర్గం

**● ప్రెసిడెంట్ గా నూతి మహేష్ రాజు,కార్యదర్శిగా రెడ్డి రూపేష్ ప్రమాణ స్వీకారోత్సవం**



**రాయచోటి మన జనప్రగతి జులై 09:–**సాయి శుభ కళ్యాణమండపంలో రోటరీ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఘనంగా నిర్వహించారు. .ప్రెసిడెంట్ గా నూతి మహేష్ రాజు, కార్యదర్శిగా మండ్ల రెడ్డి రూపేష్, కోశాధికారిగా వి.సురేష్ బాబు గార్లు ప్రమాణ స్వీకారం చేశారు ఈ ప్రమాణ స్వీకారానికి ముఖ్యఅతిథిగా ఎలక్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కె. మాధవరెడ్డి,ఏ.జీ సుధీర్ రెడ్డి హాజరై నూతన కార్యవర్గం చే ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంతో కొంత సేవా గుణం అందరూ అలవర్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పబ్బిశెట్టి సురేష్ కుమార్, కూన కృష్ణదేవరాయలు,జి.మనోజ్ కుమార్, విశ్వ జోహార్ (జోషి),డాక్టర్ రెడ్డన్న రియాజుద్దీన్ , ఎస్.కె హుస్సేన్ , సంచుల ఖాదర్ భాషా అష్రఫలి వైవియన్ ప్రకాష్ (సాయి శుభ),షబ్బీర్,మహమ్మద్ హుస్సేన్,సూర్య ప్రకాష్,బడిమల నరసింహ,ప్రముఖ వైద్యులు రెడ్డి నరేష్ , ప్రముఖ న్యాయవాది సునీల్ కుమార్ రెడ్డి,జిన్నా షరీఫ్,నూతన సభ్యులు లక్ష్మయ్య,ప్రవీణ్,సాయి ,కళ్యాణ్,చంద,శ్రీనివాసులు,శివ ప్రసాద్,సుదర్శన్,మిగతా సభ్యులు పుర ప్రముఖులు హాజరయ్యారు.

# తృటిలో తప్పిన ముప్పు

**● డ్రైవర్ అప్రమత్తతతో సురక్షితంగా బయటపడ్డ ప్రయాణికులు**




**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జులై 09:**పులివెందుల మండలంలో గురువారం మధ్యాహ్నం ఒక పెద్ద ప్రమాదం తృటిలో తప్పింది. పులివెందుల – కదిరి ప్రధాన రహదారిలోని కనంపల్లి గ్రామ సమీపంలో ప్రయాణికులతో వెళ్తున్న ఆర్టీసీ బస్సు ప్రమాదానికి గురైంది. మధ్యాహ్నం 1:30 గంటల ప్రాంతంలో బస్సు కనంపల్లి వద్దకు చేరుకోగానే ప్రమాదవశాత్తు బస్సు ముందువైపు ఉన్న కుడిచక్రం ఆక్జిల్ కట్ అయింది. ప్రమాదాన్ని వెంటనే గమనించిన బస్సు డ్రైవర్ అత్యంత అప్రమత్తతతో,సమయస్ఫూర్తితో వ్యవహరించి బస్సును నియంత్రించారు. దీంతో బస్సులోని ప్రయాణికులకు ఎటువంటి గాయాలు కాకుండా అందరూ సురక్షితంగా బయటపడ్డారు. డ్రైవర్ సకాలంలో స్పందించకపోతే పెద్ద ప్రమాదమే జరిగి ఉండేదని ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ప్రసాదరావు,టౌన్ ఇన్స్పెక్టర్ శ్రీరామ్ తమ సిబ్బందితో కలిసి తక్షణమే ప్రమాద స్థలానికి చేరుకున్నారు. ప్రధాన రహదారి కావడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా పోలీసులు త్వరితగతిన చర్యలు చేపట్టారు. క్రేన్ సహాయంతో ప్రమాదానికి గురైన ఆర్టీసీ బస్సును రోడ్డు పక్కకు తీయించి,ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. అనంతరం ప్రయాణికులను సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేర్చేందుకు తదుపరి తక్షణ చర్యలు చేపట్టారు.



మనజనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
10 - 07 - 2026

# ఉమ్మడి జిల్లాల కోర్టు ప్రాంగణంలలో 11న జాతీయ లోక్ అదాలత్



**కర్నూలు బ్యూరో మన జనప్రగతి జులై 09:**–జాతీయ, రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థల ఆదేశాల మేరకు, కర్నూలు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ, ప్రజలకు సత్వర న్యాయం అందించాలనే లక్ష్యంతో జులై 11 న శనివారము కర్నూలు మరియు నంద్యాల జిల్లాలలోని అన్ని న్యాయ స్థానాల్లో పెండింగ్ లో ఉన్న రాజీ పడదగిన సివిల్, క్రిమినల్ మరియు ప్రిలిటిగేషన్ కేసులు పరిష్కరించు కోవడానికి జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి తెలిపారు. గురువారం ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ లోక్ అదాలత్ ను పురష్కరించుకొని కర్నూలు జిల్లా కోర్టు ఆవరణంలో 8 బెంచీలు మిగతా మండలలో 23 బెంచీలు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు.ఈ అవకాశమును కక్షిదారులు అందరూ ఉపయోగించుకొని , తమ తమ కేసులను రాజీ పూర్వకంగా పరిష్కరించుకోవాలని కోరారు.

# రాజుపాలెం మండలంలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి జూలై 09:**–వైఎస్ఆర్ కడప జిల్లా రాజుపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని అర్కటవేముల గ్రామంలో గురువారం గ్రామ సభ నిర్వహించి ప్రజలకు వివిధ నేరాలపై అవగాహన కల్పించారు. జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా చేపట్టిన విజిబుల్ పోలీసింగ్ కార్యక్రమంలో భాగంగా ఈ సమావేశం జరిగింది.ప్రొద్దుటూరు ఏఎస్పీ విబూకృష్ణ, ఐపీఎస్ పర్యవేక్షణలో నిర్వహించిన గ్రామ సభలో రాజుపాలెం ఎస్ఐ ప్రణయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ పేకాట, గంజాయి, అక్రమ మద్యం, నాటుసారా విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అదేవిధంగా సైబర్ క్రైమ్, బాల్యవివాహాలు, మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలు, పోక్సో కేసులు, మోసాలు, భూ తగాదాలు, సోషల్ మీడియా దుర్వినియోగం వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో నేరస్తులు, రౌడీషీటర్ల కదలికలపై నిరంతర నిఘా ఉంటుందని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ స్పష్టం చేశారు. గ్రామాల్లో ఎలాంటి సమస్యలు ఉన్నా, అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తున్నా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. నేరాల నియంత్రణలో ప్రజల సహకారం ఎంతో కీలకమని పేర్కొంటూ అందరూ ఐకమత్యంగా ఉండాలని కోరారు.పోలీసు సిబ్బంది, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఘనంగా టిడిపి మాజీ పట్టణ అధ్యక్షుని జన్మదిన వేడుకలు



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జులై 09:**–పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణ పల్లె గ్రామానికి చెందిన టిడిపి మాజీ పట్టణ అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి 63వ జన్మదిన వేడుకలను ఆయన నివాసంలో టిడిపి నాయకులు ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. టిడిపి నాయకులు అంబకపల్లె మునయ్య,బ్రహ్మయ్య, కులశేఖర్ రెడ్డి,జగన్మోహన్ రెడ్డి లుఆయన నివాసానికి చేరుకుని ఆయన జన్మదిన కేకును కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా వెంకటరామిరెడ్డి ఇలాంటి పుట్టినరోజులు ఆయురారోగ్యాలతో,సుఖ సంతోషాలతో మరెన్నో జరుపుకోవాలని దేవుని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా నాయకుడు వెంకట్రాంరెడ్డి అని, అడిగిన వారికి లేదనకుండా తన శక్తి మేరకు సహాయ సహకారాలు అందించే వ్యక్తి అన్నారు.అలాంటి మంచి మనిషి నిండు నూరేళ్లు సుఖ సంతోషాలతో ఉండాలని దేవుని ప్రార్థిస్తున్నట్లు వారు తెలిపారు.అంతకు ముందుగా టిడిపి నాయకులు కార్యకర్తలు ఆయన నివాసానికి చేరుకుని ఆయనను దృశ్యాలువాలతో సత్కరించి పూల బొకేలు అందజేసి జన్మదిన శు భాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్యాడీ సేకరణపై సమీక్ష..!

**- విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి సమీక్ష సమావేశం**




**కడప మన జనప్రగతి జూలై 08:**–విజయవాడలోని అవంతి హోటల్లో నిర్వహించిన ప్యాడీ ప్రొక్యూర్మెంట్ రివ్యూ సమావేశం రాష్ట్ర సివిల్ సప్లైస్ శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశంలో సివిల్ సప్లైస్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్, రాష్ట్ర సివిల్ సప్లైస్ కార్పొరేషన్ చైర్మన్, డైరెక్టర్లు, శాఖకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొని ప్యాడీ సేకరణ పురోగతి, నిర్వహణ, ఎదురవుతున్న సమస్యలు మరియు భవిష్యత్ కార్యాచరణపై సమీక్షించారు.ఈ సమావేశంలో రాష్ట్ర సివిల్ సప్లైస్ స్టేట్ డైరెక్టర్ చిట్టిబోయిన సుబ్బరాయుడు యాదవ్ పాల్గొని, సివిల్ సప్లైస్ శాఖకు సంబంధించిన పలు సమస్యలు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, శాఖ పనితీరు మరింత మెరుగుపడేందుకు అవసరమైన అంశాలను మంత్రి నాదెండ్ల మనోహర్తో పాటు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వాటిపై సానుకూలంగా స్పందించిన మంత్రి, సంబంధిత అధికారులతో చర్చించి తగిన చర్యలు చేపట్టాలని సూచించినట్లు సమాచారం. సమావేశంలో రాష్ట్రవ్యాప్తంగా ప్యాడీ ప్రొక్యూర్మెంట్ను సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలపై కూడా విస్తృతంగా చర్చించారు

# పులివెందుల గురుకుల పాఠశాల సందర్శన

**- నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేసిన ఆహార కమిటీ సభ్యురాలు**





**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జులై 09:**–రాష్ట్ర ఆహార కమిటీ సభ్యురాలు జి.దేవి గురువారం కడప జిల్లా పర్యటనలో భాగంగా పులివెందులలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకుల బాలుర పాఠశాలను సందర్శించారు.ఈ సందర్భంగా పాఠశాల హాస్టల్,వంటశాల,స్టోర్రూమ్లను క్షుణ్ణంగా పరిశీలించి ఆహార పదార్థాల నాణ్యత,నిల్వ విధానం,పరిశుభ్రత తదితర అంశాలను తనిఖీ చేశారు.హాస్టల్ పరిసరాలు పరిశుభ్రంగా ఉండటంతో సంతృప్తి వ్యక్తం చేసిన లలిత,ఇదే విధంగా నిర్వహణను కొనసాగించాలని సంబంధిత అధికారులకు సూచించారు.అనంతరం హాస్టల్లో విద్యా ర్థులకు అందిస్తున్న భోజనాన్ని రుచి చూసి,ఆహార నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు.పాఠశాల నిర్వహణను సమర్థవంతంగా చేపడుతున్న ప్రిన్సిపాల్ సి.నరసింహులు, కేర్టేకర్ బి.మల్లారెడ్డిలను రాష్ట్ర ఆహార కమిటీ సభ్యురాలు ప్రత్యేకంగా అభినందించారు. రెవెన్యూ శాఖ అధికారులు, రెసిడెన్షి యల్ హాస్టల్స్ అధికారులు,పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమం ముగింపులో ప్రిన్సిపాల్ సి. నరసింహులు రాష్ట్ర ఆహార కమిటీ సభ్యురాలు దేవి ని శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు.

# వధూవరులను ఆశీర్వదించిన ఎంపీ అవినాష్ రెడ్డి



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జులై 09:** పులివెందుల పట్టణంలోని కదిరి రోడ్డు సమీపంలో ఉన్న విజయా గార్డెన్ లో దేవరకొండ చెన్నకేశవులు,దేవరకొండ లక్ష్మీదేవి ల కుమారుడు సాయి తేజ,సాకే వీరనారప్ప,సాకే కాంతముల కుమార్తె గౌతమి ల కళ్యాణం ఆదివారంపులివెందుల విజయ గార్డెన్ కళ్యాణమండపంలో ఘనంగా వివాహ వేడుకలు నిర్వహించారు.ఈ వివాహ వేడుకల్లో ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డి హాజరు కాకపోవడంతో గురువారం చెన్నకేశవుల నివాసానికి ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, మున్సిపల్ వైకాపా ఇంచార్జ్ వైయస్ మనోహర్ రెడ్డి చేరుకొని నూతన వధూవరులను దీర్ఘ సుమంగళీభవ,నిండు నూరేళ్లు సుఖ సంతోషాలతో ఉండాలని ఆశీర్వదించారు.అనంతరం వారి కుటుంబ సభ్యులతో కాసేపు ముచ్చటించారు. అంతకుముందుగా ఎంపీ అవినాష్ రెడ్డిని వైయస్ మనోహర్ రెడ్డిని చెన్నకేశవ కుటుంబ సభ్యులు ఘన స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, పట్టణ అధ్యక్షుడు ఆల్ గంగాధర్ రెడ్డి,పట్టణ ఉపాధ్యక్షుడు పార్లపల్లి కిషోర్, దాసరి చంద్రమౌళి, వైయస్సార్ చారిటబుల్ ట్రస్ట్ యజమాని ఇరికిరెడ్డి వీరారెడ్డి , మాజీ కౌన్సిలర్ మల్లికార్జున, రామచంద్ర,శేఖర్ నాయుడు, చలపతి,వెంకటపతి, వైకాపానాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# నంద్యాలలో 'జామియా తజ్కియతుల్ బనాత్' మదరాసా భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలి

**టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్ కు వినతి**




**నంద్యాల, మన జనప్రగతి జులై 09:**–నంద్యాల పట్టణంలోని 'జామియా తజ్కియతుల్ బనాత్' సంస్థ గత 22 ఏళ్లుగా స్థానిక ముస్లిం విద్యార్థినులకు ఖురాన్, హదీస్లతో పాటు తెలుగు, ఇంగ్లీష్ భాషల్లో నాణ్యమైన విద్యను అందిస్తూ సేవలందిస్తోంది. అయితే, రోజురోజుకూ విద్యార్థినుల సంఖ్య పెరుగుతుండటంతో ప్రస్తుత భవనంలో వసతుల కొరత ఏర్పడిందని, విద్యాబోధనలో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని సంస్థ ప్రతినిధులు అన్నారు.ఈ మేరకు నంద్యాల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్ ని కలిసి వారు వినతి పత్రం అందజేశారు. మదరాసాను విస్తరించడానికి, ముఖ్యంగా దూర ప్రాంతాల నుండి వచ్చే బాలికల కోసం హాస్టల్ సౌకర్యం కల్పించడానికి తమ వద్ద తగిన స్థలం లేదని వారు వివరించారు.ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ, ముస్లిం విద్యార్థినులకు మెరుగైన ఇస్లామిక్ మరియు ఆధునిక విద్యను అందించేందుకు మదరాసా భవన నిర్మాణానికి ప్రభుత్వం తరపున నంద్యాల పరిధిలో సుమారు 15 సెంట్ల స్థలాన్ని కేటాయించాలని కోరారు. స్థానిక విద్యార్థినుల విద్యావకాశాలను మెరుగుపరిచేందుకు ఈ విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్ ఈ విషయాన్ని మంత్రి ఎన్ఎండి ఫరూక్ దృష్టికి తీసుకెళ్లి, మదరాసా నిర్మాణానికి అవసరమైన స్థల కేటాయింపు జరిగేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థినుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరగా పరిష్కరించేలా చొరవ చూపుతామని ఆయన తెలిపారు.

# ఓటు హక్కును కాపాడుకుందాం

- నంద్యాల జిల్లా జనసేన నాయకుడు భవనాశి వాసు పిలుపు




**నంద్యాల మన జనప్రగతి జులై 09:–** అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని జనసేన పార్టీ నంద్యాల జిల్లా నాయకులు భవనాశి వాసు పిలుపునిచ్చారు. ఎన్నికల సంఘం చేపట్టిన 'ప్రత్యేక ముమ్మర సవరణ' (యస్ ఐ ఆర్ ) కార్యక్రమం ద్వారా ఓటర్ల జాబితాను పారదర్శకంగా, నకిలీలు లేకుండా రూపొందించేందుకు ప్రజలంతా భాగస్వాములు కావాలన్నారు.బీఎల్ఓ లు ఇంటింటికీ వచ్చినప్పుడు ప్రజలు తమ సరైన వివరాలు, ఆధారాలు అందించి ఓటును సురక్షితం చేసుకోవాలని కోరారు. నకిలీ, డూప్లికేట్ మరియు మరణించిన వారి ఓట్ల తొలగింపునకు ఈ ప్రక్రియ ఎంతో ఉపయోగపడుతుందని, బాధ్యత గల పౌరులుగా ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును రక్షించుకోవాలని ఆయన స్పష్టం చేశారు.

# హైదరాబాదూలో ఘనంగా యువ నాయకులు. వై. జయమనోజ్ రెడ్డి జన్మదిన వేడుకలు...!

**- అరేకల్ వైస్సార్సీపీ నాయకులు. గోపాల్...**



**ఆదోని మన జనప్రగతి జులై 09:–** ఆదోని. నియోజకవర్గం. వైస్సార్సీపీ యువనాయకుడు. వై. జయమనోజ్ రెడ్డి జన్మదిన. సందర్భంగా. అరేకల్ వైస్సార్సీపీ నాయకులు కార్యకర్త లు హైదరాబాదులోఆయన నివాసం లో కలిసి ఆయనకు ఘనంగా. జన్మదిన వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఆయన పుట్టినరోజును పురస్కరించుకుని నియోజకవర్గ పరిధిలోని అరేకల్ . గ్రామఅభిమానులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హైదరాబాద్ చేరుకున్నారు.ఈ సందర్భంగా కేక్ కట్ చేయించి, పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు..

# అత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలి

- ఐద్వా జిల్లా

**కన్వీనర్ చింత మౌనిక**

**మహబూబాబాద్ మన జనప్రగతి జులై 09:**–అత్యాచారానికి పాల్పడ్డ నిందితులను కఠినంగా శిక్షించాలని ఐద్వా జిల్లా కన్వీనర్ చింత మౌనిక ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు..రాజస్థాన్లో మైనర్ బాలికపై అత్యాచారం చేసిన 32 మంది నిందితులను ఫాస్ట్ ట్రాక్ కొర్టు ఏర్పాటు చేసికఠినంగా శిక్షించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ చౌరస్తాలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సభ్య సమాజం తలదించుకునేలా మైనర్ బాలికపై 32 మంది దుర్మార్గులు మానవ మృగాలు లాగా వ్యవహరించి ఐదు రోజులపాటు హత్యాచారం చేసి హతమార్చడం దుర్మార్గమ ని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకోని ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.హత్యాచారానికి గురైన బాధితురాలు కుటుంబానికి ఆయా ప్రభుత్వాలు అన్ని రకాలుగా అండగా ఉండాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా,పట్టణ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

PRINTER, PUBLISHER AND OWNED BY **YADATI VIVEKANANDA REDDY YADAV**, AND PRINTED AT M/S GOKUL PUBLICATIONS, # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), PUBLISHED AT # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), Editor : YADATI VIVEKANANDA REDDY YADAV, E-Mail :manajanapragathi@gmail.com, Cell : 8125555507 RNI No : - APTEL/2021/80174